

ఈ రైతు పేరు రాయ ఈశ్వరరెడ్డి. తర్లుపాడు మండలం కారుమానుపల్లి గ్రామానికి చెందిన ఈయనకు వారసత్వంగా రెండెకరాలు వచ్చింది. ఆ భూమిలో మూడేళ్ల నుంచి మిరప సాగు చేశారు. కాలం కలిసి రాకపోవడంతో రూ.2లక్షల మేర నష్టపోయారు. అప్పులు తీర్చేందుకు పొలం అమ్ముదామని ప్రయత్నిస్తే ఎవరూ కొనడం లేదు. రీసర్వే జరిగిన గ్రామం కావడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అటు పొలం అమ్ముకోలేక, ఇటు అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనలో కొట్టుమిట్టాడుతున్నారు.



ఈయన పేరు పిన్నిక శ్రీనివాసులు. మార్కాపురం మండలం శివరాంపురంలో ఈయనకు 2.10 ఎకరాల పొలం ఉంది. ఆ గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా తొలుత రీసర్వే చేశారు. ఆయన పొలం పక్కనే ఉన్న బంధువులకు చెందిన ఎకరం భూమిని రెండేళ్ల క్రితం కొన్నాడు. రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు కార్యాలయానికి వెళ్తే చుక్కెదురైంది. మీ గ్రామంలోని భూములు ఆన్‌లైన్‌లో చూపడం లేదు కాబట్టి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కష్టమని అధికారులు చెప్పారు. కొన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోలేక శ్రీనివాసులు అవస్థలు పడుతున్నారు.

ఇదీ జిల్లాలో రీసర్వే చేసిన గ్రామాల్లో పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల రీసర్వే ప్రక్రియ నేడు ప్రజలకు శాపంగా మారింది. నాలుగు దశల్లో చేపట్టిన ఈ కార్యక్రమంతో రైతుల కష్టాలు తీరకపోగా పలు నూతన సమస్యలు ఎదురవుతున్నాయి. మూడు సంవత్సరాల నుంచి ఆ సమస్యలన్నీ అపరిష్కృతంగానే ఉన్నాయి. ఏ మాత్రం తేడా ఉన్నా ఆయా భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్లు కావడం లేదు. అలాగే పథకాలకు ఇబ్బందిగా మారింది. రుణాలు అందడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



కారుమానుపల్లి గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)



రీసర్వే సంకటం

- ఆయా గ్రామాల్లో వేధిస్తున్న సమస్యలు
- మూడేళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- క్రయవిక్రయాలు ఆగిపోవడంతో అవస్థలు పడుతున్న గ్రామస్థులు
- పథకాలకు దూరమవుతున్న రైతులు
- బ్యాంకుల్లో రుణాలు కూడా పొందలేని దుస్థితి
- గ్రామసభలు నిర్వహించినా పరిష్కారం శూన్యం

మార్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. ఆ కార్యక్రమంతో భూములపై పారదర్శకత వస్తుందని, వివాదాలు సమసిపోతాయని గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు హడావుడి చేయగా, వాస్తవంలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. అంతా అస్తవ్యస్తంగా తయారైంది. ఏమీ చేయలేక అధికారులు ఆన్‌లైన్‌ను ఆపేశారు. దీంతో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. భూములు అమ్ముకోవాలనుకునే వాళ్లు, ఇప్పటికే విక్రయించిన వాళ్ల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని సడలింపులు ఇచ్చి రీసర్వే జరిగిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు అనుమతులిచ్చింది. కొద్దిరోజులపాటు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే ఇతర జిల్లాల్లో యథావిధిగానే జరుగుతున్నా, రెండు మాసాల నుంచి మన జిల్లాలో మాత్రం రిజిస్ట్రేషన్లు నిలిపేశారు. పలు రకాలైన సాంకేతిక కారణాలను చూపి ఆ శాఖాధికారులు క్రయవిక్రయదారులకు మొండిచేయి చూపుతున్నారు. దీంతో జిల్లాలో రీసర్వే జరిగిన గ్రామాల్లోని ప్రజలు లబోదిబోమంటున్నారు.

ఎల్‌పీ నంబర్లపై నిలిచిన రిజిస్ట్రేషన్‌లు

రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే నంబర్లకు బదులు నూతనంగా ఎల్‌పీ(ల్యాండ్ పార్శిల్) నంబర్‌ను గత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఉంచింది. ఈ నూతన ప్రక్రియతో పలు రకాలైన చిక్కులు ఏర్పడ్డాయి. ఒక సర్వే నంబర్‌లో పలు సబ్ డివిజన్‌లు ఉన్నా చాలాచోట్ల అన్నింటికీ కలిపి ఒకే ఎల్‌పీ నంబర్ కేటాయించారు. అందులో ఒకరు భూమి అమ్ముకోవాలన్నా, అందరి భూ విస్తీర్ణం

మిగతా 6వ పేజీలో

బ్యాంకుల్లో రుణాలకు చుక్కెదురు

రీసర్వే గ్రామాల ప్రజలు భూమి తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్నా కుదరడం లేదు. బ్యాంకులో రుణం పొందాలంటే పట్టాదారు పాస్‌బుక్‌తోపాటు 1బీ, అడంగల్ తప్పనిసరి. పాస్‌బుక్ ఉన్నా వెబ్‌ల్యాండ్ నుంచి 1బీ, అడంగల్‌లు రావడం లేదు. చివరికి కొందరు బ్యాంకర్లు చొరవ తీసుకుని తహసీల్దార్ నుంచి మాన్యువల్‌గా తెచ్చుకోండి రుణాలిస్తామన్నా.. రెవెన్యూ అధికారులు అందుకు సహకరించడం లేదు. అంతేకాక ఇప్పటికే రుణాలు తీసుకొని ఉన్న రైతులు కూడా పలు రకాలైన అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం రైతులు వడ్డీ చెల్లించి రుణాలను రీషెడ్యూల్ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ ఎప్పటికప్పుడు 1బీ, అడంగల్‌లు బ్యాంకుకు సమర్పించాలి. వెబ్‌ల్యాండ్ నుంచి అవి రాకపోవడంతో రుణాలను రీషెడ్యూల్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలామంది ఏళ్లగా తీసుకున్న రుణాలకు వడ్డీలు కూడా చెల్లించకపోవడంతో డిఫాల్టర్ల జాబితాలో చేరుతున్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

- 2,86,034మందికి రూ.122.22 కోట్లు
- బ్యాంక్‌ల నుంచి డ్రా చేసిన సచివాలయ సిబ్బంది
- జనవరిలో కొత్తవి మంజూరు
- నెన్నూరుపాడులో పాల్గొననున్న మంత్రి స్వామి

ఒంగోలునగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పథకం కింద డిసెంబరుకు సంబంధించిన సామాజిక పింఛన్లను జిల్లావ్యాప్తంగా శనివారం పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని 2,86,034 మంది లబ్ధిదారులకు రూ.122.22 కోట్లను అందజేయనున్నారు. అందుకు సంబంధించి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న సచివాలయ సిబ్బంది ఉదయం ఆరు గంటలకే ప్రారంభించనున్నారు. ఈ మేరకు అవసరమైన నగదును శుక్రవారమే బ్యాంకుల నుంచి డ్రా చేశారు. గత నెలలో తీసుకోని 1,283 మంది లబ్ధిదారులకు కూడా రెండు నెలలకు సంబంధించిన మొత్తాన్ని ఒకేసారి అందజేయనున్నారు. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వం లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే పింఛన్‌ను అందజేస్తోంది. కాగా కొత్త పింఛన్లను జనవరి మాసం నుంచి మంజూరు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ప్రభుత్వం వద్ద పది వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా డిసెంబరులో కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించనుంది. కొత్త పింఛన్ కోసం అందిన దరఖాస్తులపై ఆ నెలలోనే విచారణ పూర్తి చేసి జనవరి నుంచి మంజూరు చేయనుంది. కొండపి మండలం నెన్నూరుపాడులో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘి సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొననున్నారు.



జిల్లాపై తుఫాన్ ప్రభావం

- పలుచోట్ల జల్లులు
- నేడు ఒక మోస్తరు వానలు కురిసే అవకాశం
- చలి వాతావరణంతో పంటలపై తెగుళ్ల దాడి
- ఆందోళనలో అన్నదాతలు

ఒంగోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పినప్పటికీ ప్రభావం మాత్రం కనిపిస్తోంది. రెండు, మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి చలిగాలుల తీవ్రత పెరిగింది. శుక్రవారం మరింత అధికమైంది. అదేసమయంలో సాయంత్రం నుంచి జిల్లాలో ప్రత్యేకించి తూర్పు, దక్షిణ ప్రాంతాలలో జల్లులు ప్రారంభమయ్యాయి. శనివారం ఒక మోస్తరు నుంచి భారీ

మిగతా 6వ పేజీలో

మేట తొలగింపునకు రూ.100 కోట్లు

- పాలేరు, ముసిల్లో పనులు
- మారిటైం బోర్డుకు ప్రతిపాదనలు కోరిన చైర్మన్ దామచర్ల సత్య
- పలు అంశాలపై కలెక్టర్, ఇతర అధికారులతో చర్చ

ఒంగోలు, నవంబరు, 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాలేరు, ముసి నదులు సముద్రంలో కలిసే ప్రాంతంలో భారీగా మేట వేసిన ఇసుకను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) జిల్లా యంత్రాంగాన్ని కోరారు. అందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలను మారిటైం బోర్డుకు పంపాలని సూచించారు. జిల్లాలో ఆక్వా సాగు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్ తదితర మారిటైం బోర్డు పరిధిలోని అంశాలతోపాటు పాలేరు, ముసి నదులలో ఇసుక మేటల తొలగింపు ప్రాధాన్యతలపై శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, మత్స్య శాఖ ఏడీ చంద్రశేఖరరెడ్డి, ఇతర అధికారులతో కలిసి సత్య చర్చించారు. పాలేరు, ముసిలలో ఇసుక మేట లతో సముద్రం నీరు వాగులోకి ఎదురు రాక ఆ ప్రాంతంలోని ఆక్వా సాగుదారులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఎగువ నుంచి ప్రవాహం అధికంగా వచ్చినప్పుడు పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అందువల్ల ఇసుక మేటలు తొలగింపు అవసరాన్ని గుర్తించి ప్రతిపాదించాలని కోరారు. ప్రాథమికంగా ఇందుకోసం రూ.100 కోట్లు అవసరమయ్యే అవకాశం ఉందన్న విషయం చర్చ రాగా ఆ మేరకు మారిటైం బోర్డుకు ప్రతిపాదనలు పంపితే నిధుల కల్పనకు కృషిచేస్తామన్నారు. పాకలలో రూ.5కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలపై మారిటైం బోర్డు చైర్మన్ సమీక్షించారు. కొత్తపట్నం సమీపంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా జిల్లాలో ఆక్వాసాగు అభివృద్ధి తద్వారా ఉపాధి కల్పన అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆ రంగం మరింత పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పంట ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.



కలెక్టర్ అన్సారియా, అధికారులతో చర్చిస్తున్న సత్య

ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తామని మోసం

- బాలినేని తనయుడు ప్రణీత్‌రెడ్డి, చిగంజాం ఎంపీపీ అంకమరెడ్డిపై వైద్యుడు ఫిర్యాదు
- రూ.25లక్షలు వసూలు చేశారని ఆరోపణ
- డబ్బు తిరిగి అడిగితే కులం పేరుతో దూషణ

ఒంగోలు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో సంతనూతలపాడు టికెట్ ఇప్పిస్తామని చెప్పి తనను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్‌రెడ్డి, చినగంజాం ఎంపీపీ అంకమరెడ్డి మోసం చేశారని డాక్టర్ యాదాల అశోక్ ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన వద్ద రూ.25లక్షలు తీసుకుని దగా చేశారని అందులో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో డాక్టర్ అశోక్ ఆరోగ్యశ్రీ

మిగతా 6వ పేజీలో

కుటుంబం కోసం కుంచె పట్టి..

- ఉత్తమ కళాకారుడిగా ఎదిగిన ఖాశిం
- పెయింటింగ్‌లో అదుర్స్
- జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కైవసం

7



ఒంగోలులో ఆగనున్న రెండు రైళ్లు

ఒంగోలు కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మీదుగా వెళ్లే రెండు ప్రత్యేక రైళ్లు ఇక నుంచి స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆగనున్నాయి. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి విజ్ఞప్తి మేరకు 02121, 02122 జబల్పూర్-మధురై ఎక్స్‌ప్రెస్, 04717, 04718 తిరుపతి-జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఒంగోలులో నిలపనున్నారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఉత్తర్వులు ఇచ్చారు.

పన్ను చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ కట్!

- నగరంలో వసూళ్లకు ప్రత్యేక బృందాలు
- పెద్ద మొత్తం బకాయిదారులకు రెడ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పన్ను వసూళ్లపై సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో పన్ను చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ కట్ చేయాలని కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. 'నగర పాలికకు పన్నుపోటు' శీర్షికన ఒంగోలులో పేరుకుపోయిన ప్రభుత్వ భవనాలు, ప్రైవేటు భవనాల పన్నులపై ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. పెండింగ్ బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లోని రెవెన్యూ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బందితోపాటు సచివాలయ సెక్రటరీలను అందులో నియమించారు. డివిజన్ల వారీగా పెండింగ్ జాబితాలతో వసూళ్లకు సిద్ధమయ్యారు. శుక్రవారం ఆయా బృందాలకు ఆయన పలు సూచనలు చేశారు. ముందుగా పెద్ద మొత్తంలో పెండింగ్ ఉన్న గృహాలు, విద్యా సంస్థలు, హాస్పిటల్స్, వ్యాపార సంస్థలపై దృష్టిసారించాలన్నారు. మరికొన్ని బృందాలు ఇంటింటికీ తిరిగి వసూలు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ వారికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రతి రోజూ వసూళ్లపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. బృందాలపై పర్యవేక్షకులుగా మునిసిపల్ ఇంజనీర్, డీఈలు, ఏఈలను నియమించారు.

సూపర్ బజారు సభ్యత్వ నమోదు సక్రమమే

- కోర్టులో వైసీపీకి చుక్కెదురు



ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ది ఒంగోలు కోఆపరేటివ్ సెంట్రల్ బజార్ (సూపర్ బజారు)లో నూతన సభ్యత్వాల నమోదుపై వైసీపీ నేతలకు కోర్టులో చుక్కెదురైంది. గతంలో పీఏసీ కమిటీ ఉండేది. అప్పట్లో కమిటీ చైర్మన్‌గా తాతా ప్రసాద్ ఉన్నారు. అయితే ఆ సమయంలో ఎన్నికలు నిర్వహించే దిశగా నూతన సభ్యత్వాల నమోదు ప్రక్రియను ఆయన చేపట్టారు. అందులో భాగంగా 2,551 మందిని సభ్యులుగా చేర్చారు. అప్పట్లో ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్, ఎమ్మెల్సీగా మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు. ఆ సమయంలో ఎన్నికలు నిర్వహించే క్రమంలో వైసీపీకి చెందిన కాకర్ల వెంకట రమణయ్య, సరస్వతి బొట్ల, ఎస్.వెంకటరామయ్య మార్పూరి శ్రీనివాసరావుతోపాటు మరికొందరు కొత్తగా చేపట్టిన సభ్యత్వ నమోదులు చెల్లవని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై 11 సంవత్సరాలపాటు సాగిన వ్యాజ్యంపై ఎట్టకేలకు హైకోర్టు తీర్పును వెలువరించింది. నూతన సభ్యత్వాల స్వీకరణ సక్రమమేనని, వారంతా సూపర్‌బజార్ సభ్యులే నని తీర్పునిచ్చింది. దీనిపై తాతా ప్రసాద్ మాట్లాడుతూ గతంలో తాను త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఉన్నపుడు సూపర్ బజార్ అభివృద్ధి కోసం నూతన సభ్యత్వాలు స్వీకరించామని తెలిపారు. మొత్తం 2,551 మందిని చేర్పించినట్లు చెప్పారు. అయితే దానిని అప్పటి వైసీపీ నాయకులు వ్యతిరేకించి కోర్టును ఆశ్రయించడంతో ఇన్ని రోజులు ఎన్నిక ఆగిందన్నారు. కోర్టు తీర్పు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా అధికారులుగా ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లకు శుక్రవారం ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా జె.పార్థసారథిని నియమించింది. మరో డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన కె.ఆదెయ్యను హెచ్‌అండ్‌ఎఫ్‌డబ్ల్యూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించింది.




యరజర్ల ,చెరువుకొమ్ముపాలెం తారురోడ్డులో ఏర్పడిన గుంతలు

యరజర్ల-చెరువుకొమ్ముపాలెం రోడ్డు అధ్వానం

● గుంతలతో వాహనదారుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

ఒంగోలు (రూరల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలంలోని యరజర్ల-చెరువుకొమ్ముపాలెం గ్రామాల మధ్య ఉన్న తారు రోడ్డు అధ్వానంగా మారింది. భారీగా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడతున్నారు. పేరుకే తారు రోడ్డు. అయితే రహదారి అంతా గుంతలమయంగా మారి కంకర రాళ్లు లేచి ద్విచక్ర వాహనదారులు జారి పడి గాయాలపాలవుతున్నారు. యరజర్ల నుంచి కొణిజేడు, మర్లపాడు, కందులూరి తదితర గ్రామాల ప్రజలు జాతీయ రహదారికి చేరుకోవటానికి, ఒంగోలుకు వచ్చేందుకు ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. యరజర్ల - చెరువుకొమ్ముపాలెం గ్రామాల మధ్య సుమారుగా నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది.



యరజర్ల ,చెరువుకొమ్ముపాలెం తారురోడ్డులో ఏర్పడిన గుంతలు

ఎర్రకొండ అక్రమాలు నిర్ధారణ అయితే కఠిన చర్యలు

● టి.రాజశేఖర్, జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి

తాళ్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగు వారిపాలెం రెవెన్యూ పరిధిలోని ఎర్రకొండపై అక్రమ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి టి.రాజశేఖర్ తెలిపారు. 'ఎర్రకొండ.. పిండి' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మైనింగ్ అధికారులు నివేదిక అందజేశారు. అనుమతి పొందిన ప్రాంతంలో కొండ నుంచి నేషనల్ హైవే ప్రాజెక్టు ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్ట్ కోసం గ్రావెల్ తరలించినట్లు తెలిపారు. గనులు, భూగర్భశాఖ సాంకేతిక సిబ్బంది ఆకొండకు వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. హైవే రోడ్డు నిర్మాణం కోసం గ్రావెల్ తోలుతున్నట్లు పేర్కొన్నారు. గ్రావెల్‌కు సంబంధించి సీనరేజ్ చార్జీలు, డీఎంఎఫ్ తదితర చార్జీలు నేషనల్ హైవే అథారిటీ డీడీల రూపంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయితే, అనుమతికి మించి గ్రావెల్ తోలకానికి కారకులైన నేషనల్ హైవే అథారిటీ అధికారుల ద్వారా తెలుసుకుని అక్రమ తవ్వకాలు సాగించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.

అనుమతి లేకుండా మట్టి తరలింపు

వెలువారిపాలెం ఎర్రకొండ సర్వే నంబర్ 489-1ఎలో616.19 ఎకరాల భూమిలో గనుల, భూగర్భ శాఖ తాత్కాలికంగా అనుమతి మంజూరు కాకుండానే నిర్మాణ సంస్థ గ్రావెల్ తరలించినట్లు తహసీల్దార్ కె.సంజీవరావు పేర్కొన్నారు. ఈమేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. వెలుగువారిపాలెం పంచాయతీలోని బొద్దికూరపాడు సర్వే నంబర్ 489లో రెవెన్యూ రికార్డు మేరకు 663.23 ఎకరాల భూమిలో సాగర్ కాలువలు పోను 489/1లో 616.19 కొండ ఉంది. హైవే రోడ్డు నిర్మాణం కోసం మట్టి అవసర నిమిత్తం గ్రామపంచాయతీ అనుమతితో నిర్మాణ సంస్థకు సర్వేనంబర్ 489లో 1.50హెకార్ల భూమిలో తాత్కాలికంగా మట్టి తోలుకోవడానికి అభ్యంతరంలేదని అప్పటి తహసీల్దార్ జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారికి నివేదిక పంపారు. ఆశాఖ అనుమతి మంజూరు చేయకుండానే ఐదు నెలలుగా హైవే రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం మట్టిని అక్రమంగా తవ్వుతున్నట్లు విచారణలో తేలిందని తహసీల్దార్ సంజీవరావు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. సాంకేతిక పరమైన ఆధారంతో ఎంతమేర అక్రమంగా మట్టిని తవ్వింది నిర్ధారించి తగు చర్యలు తీసుకుంటామని నివేదించారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

'హుందాయ్'కు 'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల రూపాయల వార్షిక వేతనంతో 40 మంది ఫైనలియర్ విద్యార్థులు హుందాయ్ కంపెనీకి ఎంపికైనట్లు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల టెక్నికల్ డెరెక్టర్ విజయ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం కాలేజీలో కంపెనీ హెచ్ఆర్ మౌలాలి, కుతుబ్‌లు నిర్వహించిన ఎంపికకు 77మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి హైదరాబాదు హోండా కంపెనీలో విధుల్లో చేరేందుకు నియామకపత్రాలు అందజేశారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్. కోటయ్య, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి సాహిత్య, సుమలత పాల్గొన్నారు.

రీ సర్వే సంకటం

(5వ పేజీ తరువాయి)

చూపుతోంది. దీంతో రిజిస్ట్రేషన్ల సమయంలో అయోమయ పరిస్థితులు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరి సర్వే నంబర్లపై రిజిస్ట్రేషన్‌లు చేయాలంటే వెబ్‌ల్యాండ్‌లో నిషేధిత భూముల జాబితాలో ఆయా నంబర్లను చూపుతున్నారు. దీంతో ఏ సమస్య లేని భూముల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేయడం కుదరడం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఎల్‌పీ నంబర్ నమోదు చేస్తే రిజెక్ట్ చేస్తోంది. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఎవరూ చొరవ చూపకపోవడంతో రీసర్వే గ్రామాల్లోని ప్రజలు ఏం చేయాలో తెలియక తీవ్ర ఆవేదనకు గురికావాల్సి వస్తోంది.

గ్రామసభలు పెట్టినా ఫలితం శూన్యం

రీసర్వే చేసిన గ్రామాల్లో ఎక్కువగా తప్పులు దొర్లాయి. ప్రజల నుంచి ఈ విషయమై రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో నూతన ప్రభుత్వం గత నెలలో గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరించింది. ప్రతి గ్రామంలోనూ సుమారు 80శాతం మేర తప్పులు దొర్లాయని వాటిని సరిచేయాలని ప్రజలు అర్జీలు అందజేశారు. అంతవరకు బాగానే ఉన్నా తప్పులను సరిచేయడానికి వెబ్‌ల్యాండ్ సైట్ ఓపెన్ కావడం లేదు. తహసీల్దార్‌లకు లాగిన్ ఇవ్వకపోవడంతో అర్జీలను పరిష్కరించలేని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిసారించి రీసర్వే జరిగిన గ్రామాల ప్రజల కష్టాలను పరిష్కరించాలని కోరుతున్నారు.

జిల్లాపై తుఫాన్ ప్రభావం

(5వ పేజీ తరువాయి)

వర్షాలు కొన్నిచోట్ల పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితమే శ్రీలంక, తమిళనాడు మధ్య అల్పపీడనం ఏర్పడి క్రమంగా బలపడుతూ తుఫాన్‌గా మారింది. దానికి ఫెంగల్ అని పేరు పెట్టారు. తొలుత చెన్నైకి సమీపంలో ఉత్తర ప్రాంతంలో తుఫానుగా మారి తీరం దాటుతుందని, దీనివల్ల జిల్లాలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. తద్వారా జిల్లాపై ఫెంగల్ ముప్పు ఉంటుందని భావించారు. అయితే తుఫాన్ దిశ మారడంతో జిల్లాకు ముప్పు తప్పిందని శుక్రవారం సాయంత్రం ఆరుగంటలకు చెన్నైకి ఆగ్నేయంగా 38కి.మీ దూరంలో ఉంది. శనివారం మధ్యాహ్నానికి తమిళనాడులోని కరైకల్-మహాబలిపురం ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉండగా రాష్ట్రంలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలపై అధిక ప్రభావం చూపనుంది.

ప్రారంభమైన జల్లులు

ఒక రకంగా జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పిపోగా శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో వర్షం ప్రారంభమైంది. ఒంగోలు, కొండపి, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాలతోపాటు కనిగిరి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. శనివారం ఒక మోస్తరు వానలే పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారం. అయితే వర్షం కొన్ని ప్రాంతాలలో అవసరం కాగా కొద్దిపాటిగా పడితే ఉపయోగమేకాని ఎక్కువగా కురిస్తే మాత్రం తీవ్రంగా నష్టపోతామని రైతులు చెప్తున్నారు భారీ వర్షం కురిస్తే ఇటీవల వేసిన పొగాకు, శనగ దెబ్బతినే అవకాశంతో పాటు తూర్పు ప్రాంతంలో ఆ పంటలు సాగు మరింత ఆలస్యం కానుంది.

పెరిగిన చలి తీవ్రత

తుఫాన్ ప్రభావంతో జిల్లాలో నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. తెల్లవారుజాము నుంచి చలి అధికంగా ఉంటుండగా తూర్పు దక్షిణ ప్రాంతంలో పగటిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గి మబ్బులు కమ్మి చలిగాలులు వీస్తున్నాయి. అదేసమయంలో పొలంలో ఉన్న పంటలపై తెగుళ్ల దాడి పెరిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి, మొక్కజొన్న, వరి, పొగాకు వంటి పంటలపై తెగుళ్ల తీవ్రత పెరిగింది. పూతకు వచ్చిన కంది పంటపై కూడా పలు ప్రాంతాలలో పురుగు తాకిడి పెరిగినట్లు చెప్తున్నారు. మొత్తం మీద పంటలపై వర్షాల కన్నా చలి వాతావరణం ప్రభావం అధికంగా కనిపిస్తోంది.

మిర్చికి కుచ్చు తెగులు

● ఎన్నిమందులు వాడినా నియంత్రణ కరువు ● చాలా ప్రాంతాల్లో వదిలేసిన పంట ● పెట్టుబడి, నష్టాలతో రైతులు విలవిల

త్రిపురాంతకం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సిరులు కురిపించే ఎర్ర బంగారమైన మిర్చి పంటకు కాపుదశలో కుచ్చుతెగులు ఆశించింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని పలు రకాల క్రిమిసంహారక మందులను పిచికారీ చేసినా తెగులు అదుపులోకి రాలేదు. దీంతో మిర్చిపై పెట్టిన లక్షలాది రూపాయల పెట్టుబడులు బూడిదలో పోసినట్టేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెర్లోపల్లిలో కుచ్చు తెగులు సోకిన మిర్చి పంట

ఎన్ని మందులు కొట్టినా ఫలితంలేదు



నాలుగు ఎకరాలలో మిర్చి పంట వేశాను. ఇప్పటికి సుమారు 10 సార్లు మందు కొట్టాను. ఎన్ని రకాల మందులు వాడినా ఫలితంలేదు, కుచ్చుతెగులుతో పూర్తిగా నష్టపోతున్నా. ఎకరానికి రూ. 80 వేల వరకూ ఖర్చు చేశాను. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితిలేదు.

- జిల్లెళ్ళ కృష్ణారెడ్డి, మిర్చి రైతు, లేళ్లపల్లి

మండలంలో ఖరీఫ్‌లో సాధారణ సాగుతో పాటు, రబీలో మొత్తంగా సుమారు 7 వేల ఎకరాలలో రైతులు మిర్చి సాగు చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల మధ్య ఎన్నో కష్టనష్టాలకోర్చి సాగుచేసిన మిరప పంటను తెగుళ్లు చుట్టుముట్టాయి. పురుగు మందులను పిచికారీ చేస్తూ మిగతా తెగుళ్లను అధిగమించినా కుచ్చుతెగులు మాత్రం నివారణ కాలేదు. ఇప్పటికే కొందరు రైతులు ఎకరానికి రూ. 70 నుంచి 80 వేల వరకూ ఖర్చు చేశారు. కాపు సమయంలో ఈతెగులు సోకడంతో ఏపుగా పెరగాల్సిన చెట్లు, ఆకులు ముడుచుకుని ముద్దగా తయారవుతున్నాయి. తోటలు ఆకుపచ్చని రంగు నుంచి పసుపు వర్ణంలోకి మారుతున్నాయి. మండలంలోని లేళ్లపల్లి, దువ్వలి, మిట్టపాలెం, రామసముద్రం, చెర్లోపల్లి, త్రిపురాంతకం, గణపవరం, ముడివేముల, మేడపి, సోమేపల్లి, కె.అన్నసముద్రం తదితర గ్రామాలలో మిర్చి పంటకు కుచ్చుతెగులు వ్యాపించింది. కళ్లముందే పంట దెబ్బతినటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరికొన్ని చోట్ల రైతులు మిర్చిని వదిలివేశారు.



కుచ్చు తెగులుతో పెరుగుదల నిలిచిన మిరపమొక్క



రుద్రాంశ సంభూతుడుగా అంజన్న

అంజన్న రుద్రాంశసంభూత అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. కార్తీక మాసం మాసశివరాత్రి సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని రుద్రాక్షమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. - అద్దంకి టౌన్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

డ్రైనేజి, తాగునీటి సమస్యలు పరిష్కరించండి

కొరిశపాడులోని ప్రజావేదిక కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగు నెలల పాలనలో రాష్ట్రానికి 60 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అప్పులు చేయడం తప్ప సంపద సృష్టించడం చేతకాని జగన్‌రెడ్డి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయినా, ఇప్పటికీ అబద్దాలతో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజి, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి పంచాయతీ నిధులను ఉపయోగించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ వెయ్యి రూపాయలు పెంచడం, అన్న క్యాంటీన్‌లు తెరవడం, దీపం పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం, రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం చేస్తున్నామన్నారు. తాగునీటి స్కీమ్‌ల నిర్వహణకు 40శాతం లెస్ టెండర్లు వేస్తున్నారని, పనులు నాణ్యతతో చేస్తేనే బిల్లులు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావును ఆదేశించారు. పలుగ్రామాలకు చెందన రైతులు రీసర్వేలో తమ భూమి తమ పేరుతో లేకుండా పోయిందని ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

రీ సర్వే కారణంగా వచ్చిన సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారించాలని తహసీల్దార్ సుబ్బారెడ్డిని ఆదేశించారు. గ్రామాల్లో లోవోల్టేజి సమస్య తలెత్తకుండా అవసరమైనన్ని ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలని ఈఈ మస్తాన్‌రావుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీపీ సాదినేని ప్రసన్న కుమారి, జడ్పీటీసీ సభ్యుడు తుళ్లూరి వెంకట రమణ, ఎంపీడీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

3 క్వింటాళ్ల కర్పూరంతో జ్యోతి

శివనామస్మరణతో మారుమోగిన దుర్గామల్లీశ్వరి దేవస్థానం ప్రాంగణం

భక్తులు భారీగా రాక

మార్టూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓం నమశ్శివాయ, శంభోశంకర, హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల నినాదాలతో శుక్రవారం రాత్రి జాతీయరహదారి పక్కన శ్రీదుర్గామల్లీశ్వరి దేవస్థానం ప్రాంగణం మారుమోగింది. కార్తీకమాసంలో ఏటా ఈ దేవస్థానంలో భారీగా కర్పూరంతో భక్తులు అఖండ కర్పూరజ్యోతిని వెలిగిస్తారు. అఖండ కర్పూరజ్యోతిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో 3 క్వింటాళ్ల కర్పూరంతో అఖండ కర్పూరజ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమానికి తొలుత బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 2 క్వింటాళ్ల బంతి, చామంతి, మల్లి, లిల్లీ తదితర పూలతో దేవస్థానం ప్రాంగణంలో స్వామి రూపాలను, వేంకటేశ్వరస్వామి శంకుచక్రం రూపంలో అందంగా అలంకరించారు.



దేవస్థానం ఆవరణలో వెలిగించిన అఖండ కర్పూరజ్యోతి



అదేవిధంగా దేవస్థానంలో స్వామిని, అమ్మ వారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వెలిగించిన అఖండ కర్పూరజ్యోతిని భక్తులు తనవితీరా దర్శించుకొని నమస్కారాలు చేసుకున్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఐ శేషగిరిరావు బందోబస్తు ఏర్పాటుచేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మాలధారులకు భిక్షను ఏర్పాటు చేశారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

టంగుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న కసుకుర్తి అంజయ్యను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆయన వద్ద తొమ్మిది క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అంజయ్యను శనివారం కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తామని మోసం

(5వ పేజీ తరువాయి)

స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయన్ను ఎన్నికలకు ముందు ప్రణీత్‌రెడ్డి వద్దకు అంకమరెడ్డి తీసుకెళ్లారు. సంతనూతలపాడు టికెట్ గురించి మాట్లాడించారని, అందుకు వారు రూ.25లక్షలు ఇవ్వాలని కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అంకమరెడ్డికి ఫోన్‌పే ద్వారా రూ.10లక్షలు, నగదు రూ.15లక్షలు ఇచ్చానని అశోక్ తెలిపారు. అయితే తనకు టికెట్ రాలేదని, ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని అడిగితే అంకమరెడ్డి కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్‌కు శుక్రవారం రాత్రి ఫిర్యాదును అందచేశారు.

ఆధార్ నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలి

బల్లికురవ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ నమోదులో తప్పులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి చెప్పారు. బల్లికురవ మండలం ఉప్పమాగులూరు గ్రామంలోని సచివాలయంలో చేపడుతున్న ఆధార్ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. నూతనంగా ఆధార్ కార్డును ఇచ్చేటప్పుడు పేర్లు తప్పులు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. గతంలో ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరిదిద్దుకునేందుకు చేసుకున్న దరకాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాలలో వనభోజనాలు మంచి ఆహ్లాదకరం

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో వనభోజనాలు కార్యక్రమం మంచి ఆహ్లాదకరంగా ఉంటుందని, విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని ఎంఈవో బి. సుధాకరరావు చెప్పారు. మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అందరూ కలిసి కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం విద్యార్థులతో కలిసి వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో సుధాకరరావు హాజరై ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఇక ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని హెచ్ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి చెప్పారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు పోతినేని శంకరరావు విద్యార్థుల తాగునీటికి కోసం అవసరమైన వాటర్ బాటిల్స్‌ను అందజేశారు.

బాలికపై అత్యాచారయత్నం

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల బాలికపై అత్యాచార యత్నం చేసిన 60 ఏళ్ల వ్యక్తిపై చినగంజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఒక గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక ఇంటి ముందు ఆడుతుండగా, అదే గ్రామానికి చెందిన వ్యక్తి వారి ఇళ్లకు సమీపంలోని జొన్న పంటలోకి ఈ నెల 26వ తేదీ ఉదయం ఆ బాలికను తీసుకొని వెళ్లాడు. అతను అత్యాచారయత్నం చేయబోతుండగా బాలిక కేకలు వేయడంతో అటుగా ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలు కేకలు విని రావడంతో అతను పారిపోయాడు. ఉపాధి హామీ కూలీలు బాలికను వాళ్ల ఇంటి దగ్గర విడిచి పెట్టారు. బాలిక తల్లిదండ్రులు గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుక్రవారం తెలిపారు.

చిదంబరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో స్వామికి లక్ష బిల్వార్చనతో శుక్రవారం పూజలు నిర్వహించారు. కార్తీక మాసశివరాత్రి సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయంలోని చిదంబరేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు.


బొమ్మను గీస్తున్న పఠాన్ ఖాశిం

ఆయన కుంచె పడితే కళాఖండాలు ఆవిష్కృత మవుతాయి. బొమ్మను గీస్తే అద్భుతాలు అందరినీ అలరిస్తాయి. పెయింట్ వేస్తే పతకాలు ఆయన వశమవుతాయి. ఆయన ఎవరోకాదు కంభంకు చెందిన కళాకారుడు పఠాన్ ఖాశిం. తండ్రి అకాల మరణంతో కుటుంబ భారాన్ని తనపై వేసుకున్నాడు. చిత్రకళను ఉపాధి మార్గంగా ఎంచుకున్నాడు. ప్రతిభను మెరుగు పరచుకుంటూ ఉత్తమ కళాకారుడిగా ఎదిగాడు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందే స్థాయికి చేరిన ఆ జర్నీ పై ప్రత్యేక కథనం

కుటుంబం కోసం కుంచె పట్టి..

- పెయింటింగ్‌లో అందెవేసిన చేయి
- జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కైవసం


ఉత్తమ కళాకారుడిగా ఎదిగిన ఖాశిం


సుభాష్ చంద్రబోస్ చిత్రం


కంభం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పఠాన్‌ఖాశిం ఇంటర్ వరకు చదివి తండ్రి అకాలమరణంతో పై చదువులకు వెళ్లలేకపోయాడు. ఐదుగురు అన్నదమ్ముల్లో 3వ సంతానం ఖాశిం. తన కుటుంబ భారాన్ని మోయాలని భావించాడు. పాఠశాలలో చిన్నతనం నుంచి చిత్రలేఖనంపై మక్కువ పెంచుకున్నాడు. దేవతలు, జంతువులు, అక్షరాలను అందంగా గీయడం మొదలుపెట్టాడు. గోడలపై వాల్‌రైటింగ్స్, సినిమా పేర్లు రాస్తూ వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించేవాడు. ఆ డబ్బుతోనే తన అన్న ఖాశింవలీని బీయిడీ చదివించాడు. తన భార్య, ముగ్గురు బిడ్డలను ఈ వృత్తి ద్వారానే పోషించుకుంటున్నారు.

ఎన్నో అవార్డులు.. మరెన్నో సన్మానాలు

- గ్రామంలో నూతన గృహాలకు ఖాశిం చేత గోడలపై బొమ్మలు, డిజైన్లు వేయించుకునేవారు. 2016లో కంభంలో ప్రగతి ఆర్టిస్ట్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించాడు.
- రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొని ఎన్నో అవార్డులు సాధించాడు. పర్యావరణ పరిస్థితితోపాటు పలు అంశాలపై చిత్రాలు గీశాడు.
- కంభం విద్యావనరుల కేంద్రంలో గోడలపై గీసిన సరస్వతీదేవి, నాగార్జున సాగర్ డ్యాం, సూక్తులు, జాతీయ నాయకుల చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.
- అప్పటి మాజీ ఎమ్మెల్యే దివంగత చప్పిడి వెంగయ్య ఖాశింను ఘనంగా సత్కరించారు.
- 2019 అక్టోబరు 10న నంద్యాలలో జరిగిన ఆల్ ఇండియా చిత్రాల పోటీల్లో అప్పటి ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా ప్రతిభ అవార్డు అందుకున్నాడు.
- వినుకొండలో ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు చేతుల మీదుగా సన్మానం, నర్సరావుపేటలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ చేతుల మీదుగా సత్కారం అందుకున్నాడు.
- 2022లో వైజాగ్‌లో యాపిల్ బొమ్మకు, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. సేవ్ వాటర్, పాడిపంటలతో ఇండియా చిత్రపటాలకు అవార్డులు వచ్చాయి.
- తానున ఈ స్థాయికి రావడానికి తన భార్య హసీనా, గురువు షఫి ప్రోత్సాహమే కారణమని ఖాశిం చెబుతున్నారు.



భారతదేశ చిత్రం

తేనీటి చిత్రం


కళాకారులను ప్రోత్సహించాలి



పర్యావరణానికి ముప్పుతెచ్చే ఫ్లెక్సీలు రావడంతో మాలాంటి కళాకారులందరూ వీధిన పడ్డారు. ప్రభుత్వం మాలాంటి కళాకారులను ప్రోత్సహించాలి. చిత్ర కళాకారులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి. ప్రభుత్వ కళాశాలల్లో, పాఠశాలల్లో బొమ్మలు గీయడానికి దళారుల నుంచి కాకుండా నేరుగా చిత్రకళాకారులను ఎన్నుకోవాలి.

- పఠాన్ ఖాశిం


రెడ్డినగర్‌లో సాగు చేసిన బంతిపూల తోట



డిమాండ్ బాగుంది

గత రెండు సంవత్సరాల నుంచి ఎకరం తోటలో రెండు రకాల బంతి పూలు సాగు చేస్తున్నాను. ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. ఎక్కువ మంది తోట దగ్గరకు వచ్చి పూలు కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. ఎక్కువగా పూలు దిగుబడి వచ్చినప్పుడు దర్శి, అద్దంకి, పొదిలి ప్రాంతాలకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నాను. కార్తీక మాసం, అయ్యప్ప స్వాములు మాలలు ధరించటం వల్ల పూలకు డిమాండ్ ఏర్పడింది.

- దారం ప్రభుదాసురెడ్డి, రెడ్డినగర్, ముండ్లమూరు మండలం

విస్తారంగా బంతి సాగు

కార్తీక మాసం, అయ్యప్ప మాలల సీజన్ కావటంతో పెరిగిన డిమాండ్

ముండ్లమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బంతిపూల తోటలు సాగు చేశారు. ఇతర పంటలు సాగు చేసి నష్టాలు చవి చూడటంతో విసిగి వేసారిన రైతులు పూల తోటలపై దృష్టి పెట్టారు. అందులో భాగంగా మండలంలోని పసుపుగల్లు, రెడ్డినగర్, నూజెండ్లపల్లి, సింగనపాలెం, పులిపాడు, నందమూరి నగర్, బొప్పూడివారిపాలెం, ఉమామహేశ్వర అగ్రహారం, భట్లపల్లి గ్రామాల్లో విస్తారంగా బంతిపూల తోటలు సాగు చేశారు. ముద్ద బంతి పువ్వు, చామంతి పువ్వు, కారం బంతి పువ్వు అనే రకాలను ఎంచుకొని తోటలు సాగు చేశారు. కార్తీక మాసం, అయ్యప్ప స్వాములు మాలలు ధరించటంతో కార్యక్రమాలకు పూల డిమాండ్ ఏర్పడింది. దీంతో కేజీ రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతుండటంతో రైతులు కొంత ఆనందంతోనే ఉన్నారు. బంతిపూలు కావాల్సిన వారు తోటల దగ్గరకు వచ్చి కొనుగోలు చేసుకొని పోతుండగా సాగు చేసిన రైతులు అద్దంకి, దర్శి, వినుకొండ, నరసరావుపేట, ఒంగోలు, మార్కాపురం తదితర పట్టణాలకు వెళ్లి పూల మార్కెట్‌లలో అమ్మకాలు చేస్తున్నారు. మండలంలో పది నుంచి 15 ఎకరాల వరకు రైతులు బంతిపూల తోటలు సాగు చేశారు. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండటంతో వచ్చే ఏడాది ఎక్కువ మంది రైతులు బంతి పూల తోటలు సాగు చేసేందుకు సిద్ధ మవుతున్నారు.

ట్యాంకర్ నీరు రూ.1500

- శివారుకాలనీల్లో ప్రజల గగ్గోలు
- నీరు కొనుగోలు చేస్తున్న వైనం

ఒంగోలు (రూరల్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో కొప్పోలు రోడ్డులోని పలు కాలనీలకు తాగునీటి సరఫరా లేక పోవటంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గత వారం రోజుల నుంచి నీటి సరఫరా లేకపోవడంతో ట్యాంకర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీంతో శివారుకాలనీల్లోని ప్రజలు వాడుకకు నీరు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొందరు ఇతర చోట్లకు వెళుతున్నారు. కొందరు చేసేదేమీ లేక ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ నీరు రూ.800 నుంచి రూ.1500 దాకా వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి కాలనీలకు నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.


కొప్పోలురోడ్డు బృందావన కాలనీలో ట్యాంకర్‌తో నీరు పోయించుకుంటున్న కాలనీవాసులు


స్పాసెంటర్ వద్ద పోలీసులు

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

- గంజాయి ప్యాకెట్లు, కండోమ్స్ స్వాధీనం
- కేసు నమోదు

ఒంగోలు క్రైం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ స్పా సెంటర్‌లో అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పా సెంటరులో గంజాయి ప్యాకెట్లు, కండోమ్స్ దొరకడంతో నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. స్థానిక గంటాయిపాలెంలో గల వీటూ స్పా సెంటర్‌లో వన్‌టౌన్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న ఓ యువతి పరారీ కాగా స్పా సెంటర్‌లో ఉన్న సీలింగ్‌లో గంజాయి ప్యాకెట్లు, కండోమ్స్ పోలీసులు గుర్తించారు. నిర్వాహకుడు శ్రీనాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా నగరంలో గతంలో రెండు దఫాలు స్పా సెంటర్లపై పోలీసులు దాడులు చేసి నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేశారు. దీంతో మహిళలు లేకుండా స్పా సెంటర్లు కొంతమంది నిర్వహిస్తుండగా, మరికొంత మంది మూసివేశారు. అయితే వీటూ స్పా సెంటర్‌లో మాత్రం మహిళలతో బాడీ మసాజ్‌లు చేయిస్తున్నారు. పురుషులకు మహిళలు మసాజ్ చేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ వారు మహిళలనే కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఏకంగా గంజాయి ప్యాకెట్లు, కండోమ్స్ దొరకడం పట్ల పోలీసులు మరింత సీరియస్‌గా తీసుకున్నారు. ఈమేరకు వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈదర హరిబాబు

ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

- అధ్యక్షుడు ఈదర హరిబాబు

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని మౌర్యా ఇన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 జనవరిలో నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ కళాపరిషత్, భారతీయం ఆధ్వర్యంలో 64 ఆర్ట్స్ నాటక ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వివిధ పాఠశాలల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలకు ఆహ్వానం పలుకుతున్నట్లు చెప్పారు. ఒక్కొక్కటి 30 నిమిషాలకు మించకుండా ఉండాలని, కళాపరిషత్ సూచించిన ఏడు అంశాలలో ఏవైనా నాలుగు అంశాలకు తగ్గకుండా ప్రదర్శన ఉండాలన్నారు. ప్రదర్శన వివరాలు ముందుగా 8297312111 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా డిసెంబరు 15వ తేదీలోపు పంపాలని, వాటిలో ఎంపిక చేసిన వాటిని జనవరి 18 నుంచి 31వ తేదీ వరకు జరిగే కళాపరిషత్ కార్యక్రమాలలో ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. పోటీలలో గెలుపొందిన ప్రదర్శనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ఎంపికైన ప్రతి ప్రదర్శనకు రూ.5 వేలు ప్రదర్శనా పారితోషికం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రసాద్, శివప్రసాద్, ఈదర గౌతం పాల్గొన్నారు.


పోగొట్టుకున్న ల్యాప్‌ట్యాప్‌లు తిరిగి అందిస్తున్న సీఐ

ల్యాప్‌ట్యాప్‌ల చోరీ దొంగ అరెస్టు

ఒంగోలు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ల్యాప్‌ట్యాప్‌లను చోరీ చేసిన నిందితుడు బర్నబాస్‌ను అరెస్టు చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. నంద్యాల జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఒంగోలు సమీపంలోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకుంటూ స్థానిక మంగమూరురోడ్డులో గల పవిత్ర హాస్టల్‌లో ఉంటున్నారు. గురువారం వారు కాలేజీకి వెళ్ళి వచ్చేసరికి వారి ల్యాప్‌ట్యాప్‌లు కనిపించలేదు. దీంతో శుక్రవారం ఉదయం వారు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐలు శ్రీను, కృష్ణపావని సంఘటన స్థలం వద్దకు వెళ్ళి సీసీపుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. పొదిలికి చెందిన బర్నబాస్ అనే యువకుడు అదే హాస్టల్‌లో ఉంటు రియల్‌ఎస్టేట్ ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. నిందితుడు వాటిని చోరీ చేయగా అతడిని అరెస్టు చేసి ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేసినట్లు సీఐ తెలిపారు.

పల్లెలకు సరికొత్త శోభ

- రూ.2.8 కోట్లతో సిమెంటు రోడ్లు, కాలువలు
- చురుగ్గా సాగుతున్న పనులు

మద్దిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు నూతన శోభను సంతరించుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం ద్వారా చేపట్టిన సిమెంటు రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. మండలంలోని 8 పంచాయతీలకు రూ.2.8 కోట్లతో 3.25 కిలో మీటర్ల మేర పనులు మంజూరయ్యాయి. అయ్యవరాజుపాలెంలో రూ.40లక్షలు, రామాయపాలెంలో రూ.30లక్షలు, రావిళ్లవారిపాలెంలో రూ.30లక్షలు, తంగెళ్లలో రూ.30లక్షలు, ధర్మవరంలో రూ.30లక్షలు, మద్దిపాడులో రూ.80లక్షలు, గుండ్లసముద్రంలో రూ.20లక్షలు, కెల్లంపల్లిలో రూ.20లక్షలతో పనులు జరుగుతున్నాయి. సంక్రాంతి నాటికి వీటిని పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2.5 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ జాలయ్య తెలిపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కొద్దిపాటి వర్షాలకే బురదమయమవుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం కింద నిధులు మంజూరు చేయడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. కూలీలకు ఉపాధి కూడా దొరుకుతోంది. జంగాలపల్లిలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను శుక్రవారం ఎంపీడీవో జగదీష్, ఏఈ జాలయ్య శుక్రవారం పరిశీలించారు.


జంగాలపల్లిలో సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాకలలో కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభం

సింగరాయకొండ, నవండరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి మహిళా కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు మండలంలోని పాకల హైస్కూల్‌లో శుక్రవారం శిక్షణ మొదలైంది. సర్పంచ్ సైకం చంద్రశేఖర్ ప్రారంభించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.భాస్కర్‌రావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుడు హజరత్తయ్య శిక్షణ ఇవ్వనున్నారు.


కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్

డీఎల్‌డీవోగా మహాలక్ష్మి


కలెక్టర్ అన్సారియాకు బొకే ఇస్తున్న మహాలక్ష్మి

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు ఎంపీడీవోగా పనిచేస్తున్న వై.మహాలక్ష్మిని డీఎల్‌డీవోగా నియమిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీఎల్‌డీవోగా నియామకమైన మహాలక్ష్మి శుక్రవారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అలాగే పలువురు ఉన్నతాధికారులను కలిశారు.

పొగాకు సాగు నియంత్రణపై అవగాహన

కొండపి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలంలోని కామేపల్లిలో శుక్రవారం కొండపి వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు పొగాకు పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరగడం వలన గత ఏడాది ఉన్న డిమాండ్ ప్రస్తుత సీజన్‌లో ఉంటుందన్న నమ్మకం లేదన్నారు. రైతులు అనుమతించిన పరిమాణంలో మాత్రమే పంటను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ కంపెనీ మేనేజర్ వెంకటేశ్వరరావు, పో లిశెట్టి కంపెనీ మేనేజర్ రామాంజనేయులు, జీపీఐ కంపెనీ మేనేజర్ ఉన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మద్దిపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్ సుశాంత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దకొత్తపల్లి చర్చిలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ పి.అబ్రహం, రెబ్బవరపు రాఘవరావు, రెవరెండ్ పిలుపురాజు, పాస్టర్ శాంతారావు, ఆర్.రాఘవరావు, ఏబు సుందర్‌రాజు, ఆర్మీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రబీ సీజన్ ఈ-పంట నమోదు ప్రారంభం

టంగుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ఈ-పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈసారి కొన్ని ప్రధాన పంటలకు ప్రభుత్వం బీమా కూడా ప్రవేశపెట్టడంతో రైతులు ఉత్సాహం చూపుతున్నారు. వాతావరణం అనుకూలించక మండలంలోని తూర్పుగ్రామాల్లో ఇప్పటి వరకు పొగాకు, శనగ, వరి పైర్లు సాధారణ విస్తీర్ణంలో కేవలం 30 శాతం మాత్రమే సాగయ్యాయి. పడమర గ్రామాల్లో పూర్తిస్థాయిలో సాగు ముగింపునకు వచ్చింది. ఇప్పటి వరకు మండలంలో 3,500 ఎకరాల్లో పొగాకు, 260 ఎకరాల్లో శనగ, 590 ఎకరాల్లో వరి, 620 ఎకరాల్లో మినుము, 44 ఎకరాల్లో మిర్చి, 15 ఎకరాల్లో కంది సాగు చేశారు. ప్రస్తుతం తూర్పుగ్రామాల్లో ఊపందుకున్న సాగుకు తుఫాను కారణంగా బ్రేకులు పడ్డాయి. ఆ ప్రభావం తగ్గిన తర్వాత సాగు జోరందుకోనుంది.

గ్రామాల్లో క్రిస్మస్ శోభ


ఉప్పుగుండూరులో ఏర్పాటు చేసిన స్టార్

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు అత్యంత ముఖ్యమైన పండుగ క్రిస్మస్. ప్రతి ఏడాది డిసెంబరు 25న ఏసుక్రీస్తు జన్మించిన రోజుగా క్రిస్మస్ జరుపుకుంటారు. అందులో భాగంగా సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చిలను అందంగా అలంకరిస్తున్నారు. స్టార్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నారు. క్రైస్తవులు ఈ మాసం మొత్తం ఉపవాస ప్రార్థనలు నిర్వహించేందుకు చర్చిల వద్ద ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో ఉప్పుగుండూరులో యువకులు ఏర్పాటు చేసిన స్టార్ అందరినీ ఆకట్టుకుంటుంది.

నేడు పోలీసుశాఖలో బదిలీల కౌన్సెలింగ్

ఒంగోలు(క్రైం), నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ శనివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఎస్పీ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి సమాచారం ఇచ్చారు. కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐలకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుంది. ఐదేళ్ళు ఒకే చోట పనిచేసే వారితో పాటుగా ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న వారిని బదిలీలు చేసేందుకు చర్యలు చేపట్టారు. సిబ్బంది కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చేలా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్‌లో కాకుండా సొంత మండలం అయి ఉండకూడదు. మిగిలిన చోట ఖాళీ ఉన్న ప్రాంతాలలో అవకాశం కల్పించేలా తగిన చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసూతి సేవలు సక్రమంగా అందించాలి

- రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అదనపు సంచాలకులు అనిల్‌కుమార్

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో నూరు శాతం ప్రసూతి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గర్భిణుల జాబితాలు రూపొందించుకోవాలని చెప్పారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రసూతి సేవలు అందించాలన్నారు. గత సంవత్సరం ప్రైవేటు వైద్యశాలలో జరిగిన ప్రసవాల గణంకాలను సేకరించామని చెప్పారు. హైరిస్క్ గర్భిణులు వివరాలు సేకరించి ముందస్తుగా వైద్య సేవలు అందించాలని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం అమ్మనబ్రోలు పీహెచ్‌సీని, ఒంగోలులోని లక్ష్మి వైద్యశాల, విజయా డయాగ్నస్టిక్ సెంటరును ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పద్మజ, జీజీహెచ్ సూపరింటెండెంట్ జమున, డీసీహెచ్ఎస్ సూరిబాబు, డీపీఎంవో సంధ్యారాణి, వైద్య అధికారులు వాణిశ్రీ, దానియేల్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

- ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్

మద్దిపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు నిర్వహిస్తామని, అందులో పట్టుబడితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. జాతీయ రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇక పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛభారత్‌లో భాగంగా పోలీసులు స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

నాగులుప్పలపాడు: ఎస్పీ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్‌లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ పరిసరాలను పోలీసులు శుక్రవారం శుభ్రం చేశారు. స్టేషన్ చుట్టు పక్కల ఉన్న పిచ్చిమొక్కలు, వ్యర్థాలను పోలీసు సిబ్బంది నరుంబిగించి తొలగించారు.

మురుగు తీసి మూడు నెలలు

- పోతురాజుపాలెంలో పారిశుధ్యం అధ్వానం
- పట్టించుకున్న వారే లేరని స్థానికుల ఆవేదన



డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన మురుగు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం నిరంతరం పనిచేస్తున్నామని కమిషనర్ వెంకటేశ్వరరావు వెల్లడిస్తుండగా, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదు. ఒక్కో వీధిలో కనీసం మూడు నెలలైనా మురుగు కాలువలు శుభ్రం చేయకపోగా, మరోవైపు చెత్త తీసేవారు కరువయ్యారని అగ్రహారం గేటు అవతల, పోతురాజుపాలెంలో వాసులు వాపోతున్నారు. ఒకవైపు ఇటీవల కాలంలో వర్షాలు కురుస్తుండగా, మరోవైపు కాలువల్లో పూడిక తీత చేయకపోవడం కనీసం వారంలో ఒకరోజు కూడా కాలువలు తీయకపోవడం పట్ల స్థానికులు శానిటరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒకరోజు రెండు రోజులో కాదని, సుమారు మూడు నెలలుగా ఒక్కరు కూడా తమ కాలనీవైపు కన్నెత్తి చూడలేదని వెల్లడిస్తున్నారు. దీంతో ఇళ్ళలోని నీరు కాలువల్లో నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, ఇదిలా ఉంచితే తుపాను హెచ్చరిక నేపథ్యంలో తమ కాలనీలో పారిశుధ్యం పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నగరంలో వైరల్ ఫీవర్స్ పెరిగిపోగా, కార్పొరేషన్ శానిటరీ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై మరింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని కమిషనర్ ప్రతిరోజు రోజుకోవార్డు పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించి పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక దృష్టి సారించినా, ఇన్‌స్పెక్టర్లు కాసుల వేటకే పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శానిటరీ సూపర్‌వైజర్లు సైతం మెతకవైఖరి అవలంబించడంతో ఇన్‌స్పెక్టర్ల నిర్లక్ష్యంతో పారిశుధ్యం పరమ అధ్వానంగా మారింది. ఇప్పటికైనా పోతురాజుపాలెంలో పారిశుధ్యం మెరుగుపరిచి, వ్యాధుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే దళిత కాలనీల అభివృద్ధి

- ఎమ్మెల్యే దామచర్ల
- ఘనంగా అంబేడ్కర్ ఆరామక్షేత్రం ప్రారంభం


అంబేడ్కర్ ఆరామక్షేత్రం ప్రారంభించిన అనంతరం స్థానికులతో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వంలోనే దళితల కాలనీల అభివృద్ధి సాధ్యపడతాయని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని గద్దలగుంటలో రూ.33లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ ఆరామక్షేత్రాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నత్తల కనకారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ దళిత కాలనీల్లో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను, ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని తెలిపారు. డిసెంబరు 1 నుంచి కొత్తగా పింఛను కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే నిరుద్యోగ, యువత కోసం స్వయం ఉపాధి కల్పించేలా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే అవసరమైన వీధుల్లో రోడ్లు, సైడు కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని దామచర్ల హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అన్నారు. నగర సుందరీకరణ, అభివృద్ధి కోసం అవసరమైన నిధులు రాబట్టి నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో మొక్కలు నాటి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, మెప్మా పీడీ టి.రవికుమార్, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాళం నరసమ్మ, దాయనేని ధర్మ, నాయకులు నత్తల శ్రీనివాసరావు, కాకుమాను రాజేష్, కొమ్ము సురేష్, పర్రె రామకోటయ్య, దారా అంకబాబు, కంకణాల భాను పాల్గొన్నారు.

వరిలో ఉల్లికోడు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఏవో శ్రీనివాసరావు


రైతులతో మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో వచ్చే ఉల్లికోడు తెగులు పట్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. తిమ్మసముద్రం గ్రామంలో వరి పంటను పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆఖరి దుక్కిలో 20 కేజీలు జింక్ సల్ఫేట్ వాడటం ద్వారా వరి పంటలో జింక్ లోపం ఉండదని తెలిపారు. వరి నారుమడిలో ఉల్లికోడు రాకుండా 160 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలు వాడాలని సూచించారు. ఏడీఏ రమేష్‌బాబు మాట్లాడుతూ సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి పండించిన ధాన్యానికి ప్రభుత్వం స్కోప్ సర్టిఫికెట్ అందిస్తుందని, తద్వారా బయటి మార్కెట్‌లో అధిక ధర పొందవచ్చని వివరించారు. డిసెంబరు 15లోగా రైతులు పంటల బీమా పథకం ప్రీమియం చెల్లించాలని ఏవో వెంకట్రావు సూచించారు. కార్యక్రమంలో ఏవో శశికళ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు


పెద్దబజారులో జరిగిన కార్తీకమాస పూజల్లో పాల్గొన్న భక్తులు


త్రిపురాంతకస్వామి ఆలయంలో అన్నదానం



త్రిపురాంతకస్వామి ఆలయంలో శివలింగం, పార్వతిదేవికి ప్రత్యేక అలంకరణ

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పలు ఆలయాల్లో మాసశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంతనూతలపాడులోని త్రిపరాంతకస్వామి ఆలయంలో అర్చకులు ఎస్.బుచ్చిబాబుశర్మ ఆధ్వర్యంలో శివపార్వతులను, వినాయకునికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా పెద్దబజారులోని సీతారామస్వామి ఆలయం ప్రాంగణంలో శివపార్వతులకు ప్రత్యేకపూజలు చేశారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: మాస శివరాత్రి వేడుకలను మండల పరిధిలోని పలు శివాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరు శివాలయంలో ఉదయం నుండే భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు, లక్షబిల్వార్చన నిర్వహించారు. రాత్రి మహిళా భక్తులు లక్ష దీపాలు వెలిగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అన్నదానం చేశారు. ఈవో శ్రీనివాసరావు, పూజారి రామకృష్ణశర్మ, యు.వాసుప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.


ఉప్పుగుండూరులో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం

- యూబీఐ చీఫ్ మేనేజర్ సాంబశివరావు


అవగాహన కల్పిస్తున్న చీఫ్ మేనేజర్ సాంబశివరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్వానిధి లబ్ధిదారులు, వీధి విక్రయదారులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకుని మరింత ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజరు సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులో స్వానిధి బీ-స్వాభిమాన్ బీ పక్షోత్సవాలలో భాగంగా యూనియన్ బ్యాంకు ద్వారా రుణం పొందిన లబ్ధిదారులకు అవగాహన సదస్సు మెప్మా పీడీ టి.రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ స్వానిధి ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి డిజిటల్ జర్నీ ద్వారా రుణం మంజూరు చేస్తామన్నారు. దీని ద్వారా ఎనిమిది రకాలైన సోషియో, ఎకనామిక్, భద్రత పథకాలలో తప్పకుండా నమోదు కావాలని తెలిపారు. వాటి ద్వారా వ్యాపారాలకు, కుటుంబానికి భద్రత ఉంటుందని తెలిపారు. డిజిటల్ లావాదేవీల ద్వారా క్యూఆర్ కోడ్ స్కానర్ల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీని సందర్శించిన కేరళ విద్యార్థులు

చీమకుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం పరిసరప్రాంతంలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలను కేరళ రాష్ట్రానికి చెందిన క్రైస్ట్ కళాశాలకు చెందిన జియాలజీ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. గనులశాఖాధికారులు క్వారీయింగ్ ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలలో శ్లాబులు తయారీ ప్రక్రియను విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో గనులు, భూగర్భశాఖాధికారులు రాజశేఖర్, సురేష్‌కుమార్‌రెడ్డి, రాజు, శివప్ప, సురేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచే పింఛన్ల పంపిణీ

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత పింఛన్ల లబ్ధిదారులకు శనివారం ఉదయం 5-30 గంటల నుంచే మండలంలో సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని ఈవోఆర్డీ రమణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 6,784 లబ్ధిదారులకు రూ.2,86,46,000లను బ్యాంకులను డ్రా చేసినట్లు పేర్కొన్నారు. డ్రా చేసిన నిధులను గ్రామాల వారీగా సచివాలయ సిబ్బంది అందిస్తారని, లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల నుంచి పన్ను వసూలు చేయాలి : సీపీఎం

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు కార్పొరేషన్‌కు ప్రభుత్వ భవనాల నుంచి రూ.40 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే వసూలు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ ఆఫీస్, డీఆర్‌డీఏ, ఎన్ఎస్పీ ఆఫీసు, బీసీ కార్పొరేషన్, జిల్లా పరిషత్, రిమ్స్, కోర్టు భవనాలు, డ్వామా వంటి ప్రభుత్వ కార్యాలయాల భవనాల పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. వీటి వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆయన కోరారు.

అంధ విద్యార్థులకు అల్పాహారం


సీతారామయ్యకు నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాబ్యాంకు 101వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏబీఆర్ఈఏ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కర్నూల్ రోడ్‌లోని గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ అంధుల పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, బ్రెయిలీ లిపి షీట్లు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీకే.రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్రాబ్యాంకును స్థాపించి 101 సంవత్సరాలు అయిందని, ప్రస్తుతం బ్యాంకు యూనియన్ బ్యాంకులో విలీనం అయిందన్నారు. ఆయన గుర్తుగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీజీఎస్ సీటీ.రావు, ఈసీ సభ్యులు యూవీ.రత్నం, వి.పార్థసారథి, పి.ఆంజనేయులు, హేమంత్ జోషి, సీనియర్ మేనేజర్ పోలయ్య పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

మద్దిపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జామాయిల్ కర్ర కొనుగోలు విషయంలో పాత పద్ధతుల అనుసరించి రైతులకు న్యాయం చేయాలని సామాజిక వనరైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వడ్డె హనుమారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ కర్ర వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు గత నెలలో పత్రికా ప్రకటన ఇచ్చారని, అదే ప్రకారం ఈ నెలలో గుంటూరు, పల్నాడు జిల్లాలో నిర్వహించారన్నారు. ప్రస్తుతం మార్కెట్లో జామాయిల్ కర్ర టన్ను ఖర్చులు పోను నికరం రూ.7500 రైతులకు అందుతుందని, ఇంతకన్నా తక్కువ పాట ఖరారు అయితే రైతులకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో కర్ర కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

ఓటు హక్కు చాలా విలువైనది : శీలం

మద్దిపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ జేడీ.శీలం పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడులో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక నెల వ్యవధిలో మండల పార్టీ కమిటీలు వేయాలని ఆదేశించారు. ఒంగోలు డెయిరీని తిరిగి ప్రారంభించే విధంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని, పాడి పరిశ్రమ రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీసీసీ జనర్ సెక్రటరీ గడ్డం పాల్‌విజయ్‌కుమార్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పాలపర్తి విజేష్‌రాజ్, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణయ్య, నాయకులు తుమ్మల సుబ్బారావు, పులిపాటి రాఘవులు, నట్టే సుబ్బారావు, వేల్పుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణం పూర్తి కాలేదు..

- ఎంఈవో వెంకారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు స్కూళ్లలో అదనపు తరగతి గదులు నిర్మాణం పూర్తికాకపోవడంతో టీవీ ప్యానెళ్లను బిగించలేదని ఎంఈవో వెంకారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన అట్టపెట్టెల్లోనే విద్యాసామగ్రి కథనంపై ఆయన స్పందించారు. మండలంలోని ఎనికపాడు, మద్దులూరు, కొనగానివారిపాలెం, సంతనూతలపాడు జడ్పీహైస్కూళ్లలో అదనపుతరగతిగదులు పూర్తి కాలేదన్నారు. పూర్తయిన గదులకు తలుపులు, కిటికీలు పటిష్టంగా లేకపోవడం, టెక్నీషియన్ అందుబాటులోలేని కారణంగా టీవీ ప్యానెళ్లను బిగించలేదని చెప్పారు. అదనపు తరగతిగదులు, ఉన్న గదులకు మరమ్మతులు పూర్త తర్వాత ప్యానెళ్లను తరగతి గదుల్లో ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కాగా మంగమూరులో టీవీ ప్యానెళ్లు బిగించి వినియోగిస్తున్నారని ఆయన వెల్లడించారు.

ముమ్మరంగా పొగనాట్లు

మద్దిపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు బోర్డు పరిధిలో రైతులు విరివిగా పొగనాట్లు వేస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద దాదాపు 4,500 హెక్టార్లు పొగాకును రైతులు సాగు చేస్తున్నారు. వెల్లంపల్లి పొగాకు వేలంకేంద్ర కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ బోర్డు అనుమతుల మేరకే పొగాకు సాగుచేయాలని సూచించినా ఈ ఏడాది అధిక సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే దాదాపు 8వేల హెక్టార్లు పొగాకు సాగు చేస్తారని బోర్డు అధికారుల అంచనా వేస్తున్నారు. లోగడ ధరను చూసి అధికపంట పండించవద్దని పొగాకు బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

పోలీసు సిబ్బందికి యోగా శిక్షణ

కొండపి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపి సర్కిల్ పరిధిలోని పొన్నలూరు, కొండపి, మర్రిపూడి పోలీసు స్టేషన్లలోని సిబ్బందికి శుక్రవారం స్థానిక స్టేషన్‌లో సీఐ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు నిత్యం వ్యాయామం, యోగా చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బందితో కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఎస్సైలు బి.ప్రేమ్‌కుమార్, కె.అనూక్, టి.రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి

- ఆర్డీవో లక్ష్మీప్రసన్న


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు వయస్సు నిండిన యువతీ, యువకులు తప్పకుండా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆర్డీవో మాట్లాడుతూ 2025 జనవరి 25వ తేదీ నాటికి 18 సంవత్సరాలు దాటిన యువత ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ సలోమి, సీనియర్ సహాయకురాలు పద్మజానాయుడు, ప్రిన్సిపాల్ పున్నయ్యచౌదరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



ఎక్సైజ్ సీఐ జయరావ్‌కు వినతిపత్రం అందిస్తున్న ముండ్లపాడు గ్రామస్థులు

మద్యం షాపును తొలగించండి

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామంలో మద్యం షాపు వద్దంటూ సినిమా హాలు వీధికి చెందిన పలువురు ఎక్సైజ్ సీఐ జయరావ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సినిమా హాలు వీధిలో పలు కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వలన చిన్నపిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే మద్యం షాపును తొలగించాలని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పీఆర్‌కాలనీలో గల సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, అంకిత భావంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి నాయక్, స్థానిక అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

బేస్తవారపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): భారత సేవా సమితి సౌజన్యంతో శుక్రవారం బేస్తవారపేటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అన్ని రకాల నొప్పులు, గ్యాస్,అజీర్ణం, చర్మవ్యాధుల నివారణ కోసం ఈ శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 120 మందికి పరీక్షలు నిర్వహించారు. సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కనిగిరి శేఖర్,పి.పవన్ కుమార్,చెక్కా మాధవ కృష్ణ,బి.పాండు రంగారెడ్డి,ఆకుల చక్రపాణి,జక్కా బాబు రాజేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వర్లు, పూనూరు గురువారెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, గోపి శెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం ఫొటోగ్రాఫర్‌కు అవార్డు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కాపురానికి చెందిన ఫొటో గ్రాఫర్ పి.కృష్ణమూర్తికి అవార్డు లభించింది. గుంటూరులో నిర్వహించిన ఏపీ ఫొటోగ్రఫి విభాగంలో కృష్ణమూర్తికి ప్రథమ విజేత అవార్డు అందజేశారు. పట్టణానికి చెందిన ఫొటో గ్రాఫర్లు కృష్ణమూర్తిని అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఫొటోగ్రాఫర్ కృష్ణమూర్తి

సమగ్రాభివృద్ధిలో ఉద్యోగులదే కీలకపాత్ర

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పొదిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో ఉద్యోగులదే కీలకపాత్ర అని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన మండల, సచివాలయ స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే ప్రజల మన్ననలను అందుకుంటారన్నారు. గత వైసీపీ పాలనలో ఉద్యోగులు, అధికారులు, కార్యకర్తలపై దౌర్జన్యకాండ జరిగిన విషయాన్ని గుర్తెరగాలన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి టీడీపీ సానుభూతిపరులను పలురకాలుగా ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో అలా ఉండదని, ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఏదైనా పనిమీద ప్రజలు కార్యాలయానికి వస్తే ఎక్కువసార్లు తిప్పుకోవడం మానుకోవాలని అధికారులకు సూచించారు. పని కాకపోతే ఎందుకు కాలేదని విషయం తెలియజేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ నిర్వాకంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. త్వరలో రెవెన్యూ సదస్సులు పెడతామని, పొలాలకు సంబంధించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు రేషన్, పెన్షన్ తొలగించబడితే వారికి పరిశీలించి న్యాయం చేయాలన్నారు. భూఆక్రమలపై రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించాలని తేల్చిచెప్పారు.

అనుమతులు లేకపోయినా పనులు ప్రారంభం

దర్శి నుంచి పొదిలి పెద్దచెరువుకు పైపులైన్ ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు అనుమతులు లేకపోయినా ప్రజలను మభ్యపెట్టేందుకు గత ప్రభుత్వ పెద్దలు హడావుడి చేశారన్నారు. అనుమతులు లేకపోయినా కాంట్రాక్టర్ ద్వారా పనులు చేపట్టి కాంట్రాక్టర్‌తో రూ.10కోట్లు ఖర్చు చేయించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టెండర్లను ఆహ్వానించి పనులు పూర్తి చేసి నీటిని అందిస్తామన్నారు. అదే విధంగా బేస్తవారిపేట నుంచి ఒంగోలు నేషనల్‌హైవే త్వరలో రానుందని పొదిలి బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తీరుస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, కమిషనర్ శ్రీనివాసులు, ప్రత్యేక అధికారి విద్యాసాగర్, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, దర్శి ఏడీఏ బాలాజీనాయక్, సీడీపీవో సుధామారుతీ, ఆర్టీసీ డీఎం సుందరరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం గోపాలకృష్ణ, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నచెరువులో ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

త్వరలో భూములకు సంబంధించి కొత్త చట్టం రాబోతున్నదని, ఆచట్టం ద్వారా ఆక్రణదారులకు కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఆక్రమణలు జరిగినట్లు రుజువైతే తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిన్నచెరువు పూర్తిగా ఆక్రమణకు గురైందని ఆక్రమించిన వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని నగరపంచాయతీ కమిషనర్‌ను ఆదేశించారు.



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల , హాజరైన అన్నిశాఖల అధికారులు

ఆక్రమణల తొలగింపులో క్రమపద్ధతేదీ?

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో ఇటీవల తొలగించిన ఆక్రమణలు క్రమపద్ధతిలో లేవని వైసీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఎజెండాలోని 46 అంశాలు చదివిన తర్వాత కో ఆప్షన్ సభ్యుల్ పఠాన్ అమిరుల్లాఖాన్ మాట్లాడుతూ గత సమావేశంలో టేబుల్ అజెండా లేదని, ఈ సమావేశంలో పెట్టటం ఎందుకని ప్రశ్నించారు. చైర్మన్ మాట్లాడుతూ గత సమావేశంలో కలెక్టర్‌కు నివేదించాల్సిన అంశం కనుక టేబుల్ అజెండాలో పెట్టలేదన్నారు. 31వ వార్డు కౌన్సిలర్ చిన్న షెక్షావలి మాట్లాడుతూ కౌన్సిలర్‌లకు ఎజెండా కాపీలు 3 రోజుల ముందు అందజేయడం లేదని, పట్టణంలో ఫాగింగ్ మిషన్‌లు పనిచేయటం లేదని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. 3వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణల పేరుతో క్రమ పద్ధతి లేకుండా పార్క్ స్థలంలో బండ్లు ఏర్పాటు చేయటం ఏమిటని ప్రశ్నించారు. కౌన్సిల్ తీర్మానం లేకుండానే ఎలా పనులు చేస్తున్నారని, వీటన్నింటికి అధికారులు గంగిరెద్దుల్లా తలలు ఊపుతున్నారని ప్రశ్నించారు. మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్‌లు మొఘల్ సిరాజ్, కొత్త కృష్ణలు మాట్లాడుతూ కౌన్సిలర్‌లకు తెలియకుండా పట్టణంలో పనులు జరుగుతున్నాయని, కాలువలపై ఆక్రమణల తొలగింపు అని బిల్డింగ్‌లు కూల్చారని అన్నారు. దీనిపై కమిషనర్ నారాయణ మాట్లాడుతూ అధికారులు గంగిరెద్దులా తల ఊపుతారని అన్న పదాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చే తొలగించామని, తమ ఉద్యోగ బాధ్యత మాత్రమే నెరవేర్చామన్నారు. ఈ దశలో వైసీపీ కౌన్సిలర్‌లు, కమిషనర్‌కు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. చైర్మన్ బాలమురళీకృష్ణ జోక్యం చేసుకుంటూ పట్టణంలో ఆక్రమణల తొలగింపుపై ప్రజా ప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, ఇప్పటికైనా సమాచారం అందించాలన్నారు. టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య మాట్లాడుతూ అధికారులు నాయకుల తొత్తులు అనటం సరికాదని, ప్రజలందరూ పట్టణంలో ఆక్రమణల తొలగింపుపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, మంచి పనులు చేస్తే తోడ్పాటు అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఈ శ్రీనివాసులు, మేనేజర్ శ్రీనివాసన్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమణలపై సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా నీరు అందిస్తామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల మాట్లాడుతూ రానున్న 2 సంవత్సరాలలో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తామన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాలలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించానని, ఇంటింటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్ళినట్లు ఆయన తెలిపారు. పట్టణానికి తాగునీరు అందించడానికి రామన్నకతువ నుంచి నీరు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడిని నివారించే చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో పట్టణానికి మరిన్ని నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. నగర పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసేందుకు కౌన్సిలర్లు, నగర పంచాయతీ అధికారులు సహకరించాలన్నారు. త్వరలో ప్రజాసమస్యల పరిష్కారానికి తాను కూడా ప్రతి వార్డులో అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తానన్నారు. పట్టణంలో ట్రాఫిక్, పరిశుభ్రతపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ వెంకటదాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



గిద్దలూరు నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

సీఎం సహాయ నిధితో పేదల ఆరోగ్యానికి భరోసా

గిద్దలూరు టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి భరోసా అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని 19 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.17,04,843 లను మంజూరు చేయించి వారికి చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ తమ ఆరోగ్య సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి భరోసా కల్పించారని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి, సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడి మృతి



కిరణ్ (37)

పొదిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో పారిశుధ్యకార్మికుడు మృతి చెందాడు. ఈఘటన శక్రవారం చోటుచేసుకుంది. నగరపంచాయతీ పరిధిలో ఉదయం పారిశుధ్యపనులు చేస్తుండగా నేతపాలెంకు చెందిన కె. కిరణ్(37) కు గుండెపోటు రావడంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఒంగోలు తరలిస్తుండగా మృతి చెందినట్లు తోటి కార్మికులు తెలిపారు. కిరణ్ పారిశుధ్యపనులేగాక ట్రాక్టర్ డ్రైవర్‌గాను, ఎలక్ట్రికల్ పనుల్లో తోడ్పాటునందించే వాడని తెలిపారు. కిరణ్‌కు భార్య ,ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

పెద్ద దోర్నాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబరు 1వ తేదీన జరిపే ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీసీఈ ఆదేశాల మేరకు శుక్రవారం రెడ్ రిబ్బన్ క్లబ్ యాక్టివిటీస్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సావిత్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులకు పెయింటింగ్, రంగోలి, పోస్టర్ మేకింగ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది విజయబాబు, జయసింహా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్ రిబ్బన్ రంగులు వేస్తున్న విద్యార్థులు



కోటి దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వైభవంగా కోటి దీపోత్సవం

గిద్దలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస పూజలలో భాగంగా పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం వైభవంగా కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు లక్ష్మీనారాయణ, అల్పాహార దాత వాడకట్టు శివ ప్రసాద్, దేవస్థానం ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. శివునికి సామూహికంగా పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఆఖరి శుక్రవారం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ఆఖరి శుక్రవారం పూజలు వైభవంగా నిర్వహించారు. స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ, మార్కండేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజ శర్మలు స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో జగదాంబ

క్రైం సమాచారం

తాళం వేసిన ఇంటిలో చోరీ

- 4 తులాల బంగారం, రూ. 35వేల నగదు అపహరణ

కంభం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం సూరేపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంటిలో దొంగలు బీరువాలో దాచిన నాలుగున్నర తులాల బంగారు, రూ.35వేల నగదు అపహరించుకుపోయారు. ఈఘటన గురువారం రాత్రి జరిగింది. కంభం ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం ఇంటి యజమాని వెంకటరావు భవాని దీక్ష చేపట్టాడు. అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం గ్రామంలో బంధువుల ఇంట్లో జరుగుతున్న పూజకు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా బంగారు, నగదు, ఇతర వస్తువులు దొంగిలించినట్లు గుర్తించారు. వెంటనే కంభం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ సుధాకర్ ఇంటిని పరిశీలించారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కంభం పోలీసులు తెలిపారు.



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ సుధాకరరావు

గుర్రపుశాలలో 12 నివాసాల్లో చోరీ

- రూ.14వేల నగదు, 25 గ్రాముల బంగారం అపహరణ

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గుర్రపుశాల గ్రామంలో సుమారు 12 నివాసాల్లో చోరీ జరిగినట్లు తెలిసింది. గ్రామంలోని ఎస్సీ పాలెంలో కొన్ని కుటుంబాలు బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం వేసిన నివాసాల్లో దొంగతానికి పాల్పడ్డారు. శుక్రవారం ఎస్సీ పాలెంలోని కొన్ని కుటుంబాలు పనులు ముగించుకొని వచ్చి చూడగా చోరీకి గురైనట్లు అనుమానం వచ్చింది. వారితో పాటు వారి కుటుంబ సభ్యుల నివాసాల్లో పరిశీలించగా ఆయా నివాసాల్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకర రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ పి. చౌడయ్య సిబ్బందితో చోరీకి గురైన నివాసాలను పరిశీలించారు. క్లూస్ టీమ్ ద్వారా అన్ని రకాల విచారణ చేపడుతున్నట్లు వారు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



గుర్రపుశాలలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్నసీఐ, ఎస్సై

యువకుడిపై దాడి

మార్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తనబంధువైన యువతి వెంట ఎందుకు పడుతున్నావంటూ ఓ యువకుడు మరో యువకుడిని ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురై దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు స్థానిక తర్లుపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాలలో అదే ప్రాంతానికి చెందిన యువతి చదువుతోంది. కాలేజీకి రోజూ వచ్చేపోయే సమయంలో కాలేజీ రోడ్డులోని అజంతా బార్ సమీప ప్రాంతానికి చెందిన చిన్ని అనే యువకుడు వెంటపడుతున్నాడు. ఈ విషయమై శుక్రవారం సాయంత్రం యువతి సమీప బంధువు షాకీర్ ఇది పద్దతి కాదని చిన్నిని వారించాడు. తననే బెదిరిస్తావా అంటూ చిన్ని, అతని స్నేహితులు 10 మందికి కాలేజీ సమీపంలోకి పిలిపించాడు. షాకీర్‌ను పిలిచి మాట్లాడుతూ ఒక్కసారిగా దాడిచేసి కొట్టారు. దీంతో గాయాలపాలైన షాకీర్‌ను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందడంతో విచారిస్తున్నారు.

జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఎంపిక



ఖాజా రహీం

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఖాజా రహీం జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ విద్యను చదివి ఇటీవల పరీక్షలు రాసిన రహీం ఉత్తీర్ణత సాధించి జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఎంపికయ్యారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో రహీం మేనమామ, టీడీపీ నాయకులు అల్తాఫ్ సహకారం అందించారు.

ఒక రోజు ముందుగానే పింఛన్లు

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్ పండుగ నడుస్తోందని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఏరిక్షన్ బాబు అన్నారు. శుక్రవారం ఎర్రగొండపాలెం పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించే దిశగా సీఎం ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషిచేయాలి

ముండ్లమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి వీవోఏలు బాధ్యతగా పనిచేయాలని ఏపీఎం టి.హనుమంతరావు అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వీవోఏ తన పరిధిలో ఉన్న సంఘాలు సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలు సంఘంలో ఉన్న సభ్యులకు చేరేవిధంగా పని చేయాలని సూచించారు. గతంలో ఆగిపోయిన సంఘాలను తిరిగి పునరుద్ధరిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సీసీలు కోటేశ్వరరావు, రత్నకుమారి, అకౌంటెంట్ మార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహారుద్రాభిషేకాలు

పామూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మహారుద్రాభిషేకాలు, రుద్రహోమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్‌లు గుర్రం వెంకటేశ్వర్లు, యేల్చూరి బాలకొండలరావు, కావిటి సుబ్బయ్య, గుత్తిరాజ, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, చీతిరాల రమేష్, యోగేశ్వరరెడ్డి, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి పని కల్పించాలి


మాట్లాడుతున్న ఏపీడీ లలితకుమారి

ముండ్లమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజులు పని దినాలు కల్పించాలని డ్వామా ఏపీడీ ఆర్.లలితకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి కూలీలకు పని కల్పించటంలో మండలం వెనుకబడి ఉందని చెప్పారు. ఇటీవల గ్రామ సభలో ఆమోదించిన పనులు మాత్రమే చేయాలన్నారు. ఇష్టానుసారంగా పనులు చేపడితే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పని ప్రదేశంలోనే హాజరు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో కె.నాగరాజు, ఈసీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పామూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని ఎంపీడీవో బి.సురేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని చింతలపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువును పరిశీలించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు తెలపాలన్నారు. ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న క్యాటిల్‌షెడ్‌ను పరిశీలించారు. అనంతరం పడమటకట్టకిందపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఆధార్ బయోమెట్రిక్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో బి.మాల్యాద్రి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సరుకుల వివరాల్లో తేడాలుంటే చర్యలు

పామూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పురుగుమందులు, ఎరువులను అమ్మే దుకాణందారులు స్టాకు వివరాలను సక్రమంగా నమోదు చేయకపోతే చర్యలు తప్పవని జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జె.కులశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. స్టాకులో ఉన్న వివరాలకు గోడౌన్‌లో ఉన్న వివరాలకు వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించారు. బిల్లులు ఇవ్వకుండా రైతులకు సరుకును విక్రయించడం నేరమన్నారు. ఈసందర్భంగా పలు కంపెనీ లకు చెందిన రూ.2,51,580 విలువ కలిగిన 203 ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. 31,130 విలువ కలిగిన పురుగు మందులను సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్ రవిబాబు, ఏవో శివనాగప్రసాద్, బి.రామారావు, ఏవో కె.రాధ తదితరులు పాల్గొన్నారు.

భవనాలు నిర్మించారు.. ప్రారంభోత్సవాలు మరిచారు..

- చాలీచాలనీ గదుల్లో కొనసాగుతున్న గ్రామ సచివాలయాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ముండ్లమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోట్లాది రూపాయలతో గ్రామ సచివాలయాలు నిర్మించారు. వాటిని ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో చాలీచాలని గదుల్లో సచివాలయాలు కొనసాగుతున్నాయి. కార్యాలయాలకు పనుల మీద వెళ్ళిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేసి నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. మండలంలో 17 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయానికి రూ.45 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చు పెట్టి భవనాలు నిర్మించారు. ఇవి పూర్తయి


ప్రారంభోత్సవానికి నోచుకోని ముండ్లమూరులోని గ్రామ సచివాలయం

సంవత్సరం గడుస్తున్నా ప్రారంభంకాలేదు. కొన్ని సచివాలయాలు చుట్టూ చిల్లచెట్లు పెరిగిపోయాయి. మండల కేంద్రమైన ముండ్లమూరు గ్రామ సచివాలయం నిర్మాణం పూర్తయి ఏడాది దాటిపోయినా ప్రారంభానికి



ప్రారంభానికి నోచుకోని పూరిమెట్లలోని రైతు భరోసా కేంద్రం

నోచుకోలేదు. ప్రస్తుతం సచివాలయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతోంది. ఇరుకు గదులు కావటంతో సిబ్బంది కూర్చోవటానికే సరిపోవటంలేదు. దీంతో పనులు మీద వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే, శంకరాపురంలోని గ్రామ సచివాలయం నిర్మించి కూడా సంవత్సరం కావస్తుంది. ఇంతవరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. జమ్మలమడక, ఈదర, పోలవరం, నూజెండ్లపల్లి, పూరిమెట్లలో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు సంవత్సరం క్రితం పూర్తయ్యాయి. సంబంధిత అధికారులు వాటి ప్రారంభోత్సవం వైపు దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. కొన్ని సచివాయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, మరికొన్ని పంచాయతీ భవనాల్లో నడుస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ సచివాలయాలను ప్రారంభించి ప్రజలు, సిబ్బంది ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కొంతమంది విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలై చెడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు దరిచేరనీయకూడదని హితవు పలికారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. సైబర్ నేరగాళ్ల ప్రలోభాలను నమ్మి వారివలలో కొంతమంది చిక్కుకొని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

మాదకద్రవ్యాలు సేవించటం నేరం

కనిగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను సేవించటం నేరమని ఎస్ఐ టి.శ్రీరాం అన్నారు. స్థానిక నేతాజీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యువత మాదకద్రవ్యాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలు సేవించటం ద్వారా యువకుల్లో మెదడు మొద్దబారిపోయి జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. దీంతో చదువులో రాణించలేక సమాజంలో విలువను కోల్పోతారన్నారు. తల్లిదండ్రుల ఆశలకు తగ్గట్టుగా ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో మంచి స్థాయికి చేరుకోవాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు, పానీయాలు అమ్ముతుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తోటి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో పొందుపరచినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీరాం

విద్యార్థినులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న లక్ష్మి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం కురిచేడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను ఆమె సందర్శించారు. విద్యార్థినుల తరగతి గదులు, వంట శాలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కూరలు రుచిగా శుభ్రంగా వండాలని సూచించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. కొన్ని ఆరోగ్య సూత్రాలు చెప్పి డాక్టరుగా వారి అనుమానాలను నివృత్తి చేశారు. పాఠశాలకు అవసరమైన వాటిగురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉత్తీర్ణతా శాతం పెరగడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆటలు ఆడుకోవడానికి సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాట్రాజు నాగరాజు, మొఘల్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

- ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. అలాగే, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని చెప్పారు. శుక్రవారం రాత్రి ముండ్లమూరు సబ్‌స్టేషన్‌ను సందర్శించి పెండింగ్ విద్యుత్ బకాయిల జాబితాను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు రూ.650 కోట్లు, గృహ వినియోగదారులు రూ.250 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించినట్టు చెప్పారు.


సబ్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

సౌర విద్యుత్‌తో వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందని వెంకటేశ్వర్లు అన్నారు. కిలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొనేందుకు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుందన్నారు. అందులో రూ.30 వేలు సబ్సిడీ ఉంటుందని చెప్పారు. మిగతా రూ.40వేలకు బ్యాంకులు 90 శాతంమేర రుణం ఇస్తాయన్నారు. ప్రకాశం జిల్లాలో 267 మంది సౌర విద్యుత్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. దర్శి డివిజన్ పరిధిలోని 16 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 46 ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. జిల్లాలో 18 సబ్ స్టేషన్‌లు మంజూరు కాగా, 17 పూర్తిచేశామన్నారు. దర్శి డివిజన్ పరిధిలో ముండ్లమూరు మండలం పెదఉల్లగల్లు, కురిచేడు మండలం కళ్ళురులో సబ్‌స్టేషన్‌ల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. అనుమతులు రాగానే పనులు మొదలు పెడతామన్నారు. మన జిల్లాలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రెండు వేల విద్యుత్ వ్యవసాయ కనెక్షన్‌లను మంజూరుచేసినట్టు చెప్పారు. ఇంకా 3,329 కనెక్షన్‌లు ఇవ్వటం జరుగుతుందన్నారు. మార్చి నెలాఖరు నాటికి అవి కూడా పూర్తిచేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 120 ట్రాన్స్‌ఫారాలు చోరీకి గురయ్యాయన్నారు. అందులో 40 రికవరీ చేసి వినియోగదారులకు అందించినట్టు చెప్పారు.

కార్యక్రమంలో ఈఈ పి.శ్రీనివాసులు, ఏడీఈలు కె.పిచ్చయ్య, ఆర్.మోహనరావు, కన్‌స్ట్రక్షన్ ఏడీఈలు సత్యనారాయణ, మురళీకృష్ణ, ఏఈ టి.అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

దొనకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వాతావరణ కాలుష్యం- పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు దొనకొండలోని కెజీబీవీ పాఠశాల, వివేకానంద పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన మొత్తం 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని షేక్ సాఫియా, గౌతమీ డిగ్రీ కాలేజీ విద్యార్థి జి.అబ్రహం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాయమోగి, అడ్మిన్ నానిలు బహుమతులు అందజేశారు. అనంతరం కేకు కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వర్‌రెడ్డి, మహాలక్ష్మి, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న ల్యాండ్ ఫోన్లు

- కురిచేడులో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎత్తివేత

కురిచేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రాంతంలో ల్యాండ్ ఫోన్లు కనుమరుగు కానున్నాయి. వినియోగదారులు తగ్గడంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు ఇక్కడి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ని ఎత్తివేయడానికి నిర్ణయం తీసుకున్నారు. అందుకనుగుణంగా ఎక్స్ఛేంజ్‌లోని వస్తువులను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. సెల్‌ఫోన్ టవర్ల వద్ద చిన్న బాక్సు బిగించి అక్కడ నుంచి ఫైబర్ కేబుల్ ద్వారా నెట్, ఫోన్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

కురిచేడులో నాలుగు దశాబ్దాల క్రితం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ని ఏర్పాటుచేశారు. కాలక్రమేణా 450 మంది వరకు వినియోగదారులు చేరారు. ఆతర్వాత సెల్‌ఫోన్లు రంగప్రవేశం చేయడంతో ల్యాండ్‌ఫోన్ల సంఖ్య తగ్గుముఖం పట్టాయి. నేడు ఒక్క ల్యాండ్ కనెక్షన్ కూడా లేదు. దీంతో అద్దె భవనంలో కొనసాగుతున్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ను ఎత్తివేసేందుకు బీఎస్ఎన్ఎల్ సిద్ధమైంది. అందుకనుగుణంగా అందులోని వస్తువులను ఒక్కొక్కటిగా తరలిస్తున్నారు. శుక్రవారం ఎక్స్ఛేంజ్‌లోని ఏసీలను తొలగించి తీసుకెళ్ళారు.


కురిచేడులోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్

ప్రస్తుతం ఉన్న ఎక్స్ఛేంజ్ వెనుక సెల్ టవర్ ఉంది. అక్కడ ఒక పెట్టెలాగా ఏర్పాటు చేసి అక్కడ నుంచి ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్‌నెట్, ల్యాండ్ ఫోన్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఓ ప్రైవేటు సంస్థ ద్వారా కురిచేడులో ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇస్తున్నట్టు చెప్పారు. త్వరలో పెద్ద సంఖ్యలో కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు 4జి నెట్ వర్క్ అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. అలాగే, ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్‌నెట్ ల్యాండ్ కనెక్షన్ ఇస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ రాష్ట్ర ఫైనాన్స్ డైరెక్టర్ రామదాసు

విద్యుత్ బకాయిలను వసూలు చేయాలి

దర్శి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని విద్యుత్ శాఖ రాష్ట్ర ఫైనాన్స్ డైరెక్టర్ కె.రామదాసు సూచించారు. శుక్రవారం స్థానిక ట్రాన్స్‌కో డివిజనల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. విద్యుత్ అక్రమ వాడకాన్ని పూర్తిగా నివారించాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు, వ్యవసాయదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సీనియర్ అకౌంట్స్ అధికారి సుబ్బారావు, ఈఈ పి.శ్రీనివాసులు, డీఈలు కె.పిచ్చయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

నూతన వంగడాలతో సాగు చేపట్టాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి

దొనకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నూతన వంగడాల సాగు చేపట్టాలని ప్రాంతీయ పరిశోధన కేంద్రం(లాం ఫాం) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పప్పుదినుసుల పరిశోధన కేంద్రం(లక్నో) తయారుచేసిన సౌభాగ్య కంది రకాన్ని ప్రయోగాత్మకంగా దొనకొండ గ్రామంలోని 16 మంది రైతులతో సాగు చేయిస్తున్నట్టు చెప్పారు. వీటి ఫలితాల ఆధారంగా వచ్చే ఏడాది ఇతర ప్రాంతాల్లోని ఎక్కువమంది రైతులకు అందిస్తామన్నారు. శాస్త్రవేత్త కేవీ శివారెడ్డి కందిలో కొత్త రకాల గురించి వివరించారు. కీటక శాస్త్రవేత్త సాంబశివరావు మాట్లాడుతూ పంటలలో పురుగుల నివారణ గురించి తెలిపారు. కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, ఏఈవో జి.యోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు


పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న వీర్రాజు

దర్శి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణకు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని జోనల్ డిప్యూటీ డైరెక్టర్ కె.వీర్రాజు సూచించారు. దర్శి పట్టణంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలను క్రమంతప్పకుండా నిర్వహించాలన్నారు. మురికినీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురికినీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ప్రజలు జ్వరాల బారిన పడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి ఎస్.బసవారావు, సుభాషిణి, సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు


ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న పూడికతీత

తాళ్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-అద్దంకి వెళ్లే మార్గంలో మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో ఎత్తు తక్కువలో ఉన్న తూములను తొలగించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలో శ్మశానం పక్కగా ఉన్న మార్గంగుండా నిత్యం వ్యవసాయ పనుల కోసం రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. శ్మశానం సమీపాన మురుగునీరు వెళ్లేందుకు తూములు ఏర్పాటుచేశారు. కుంకుపాడు రోడ్డు ఎత్తుగావేయటం, తూములు పూడి పోవటంతో మురుగునీరు తూముల పైగుండాప్రవహిస్తున్నది. దీంతో పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలు సాగించేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ నాయకుడు ఐ.శ్రీనివాసరెడ్డి ఈ సమస్యను ఎంపీడీవో కె.సుందరరామయ్య దృష్టికి తీసుకెళ్లారు. తూముల్లోని పూడికతీత తీయించి, వాటి ఎత్తులేపాలని విన్నవించారు. పూడిక తీత పనులతో పాటు తూముల ఎత్తుపెంచి సమస్యను పరిష్కరించాలని గ్రామకార్యదర్శి ఐవీ రమణారెడ్డిని ఎంపీడీవో ఆదేశించారు. ఆమేరకు జరిగిన పనులను పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. దీంతో రైతుల ఇబ్బందులు తొలగిపోయాయి.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

దర్శి నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బొగ్గవరపు సుబ్బారావుస్వామి ఆధ్వర్యంలో స్వాములకు పడిపూజ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

దొనకొండ: స్థానిక విజయాంజనేయస్వామి దేవాలయంలో ఇరుముడి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. 41 రోజులు దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలధారణ స్వాములకు గురుస్వాములు బాలరంగయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు స్వాములు ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు ఇరుముడితో శబరిమలై బయలుదేరారు.

నేడు పింఛన్ల పంపిణీ

వీసీపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల నగదు ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పంపిణీ చేయనుంది. డిసెంబరు 1వతేదీ ఆదివారం సెలవుదినం కావడంతో శనివారమే పింఛన్ల పంపిణీ చేయనున్నారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, డప్పు కళాకారులు మొత్తం 4759మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి పింఛన్లు పంపిణీ చేసేందుకు డిసెంబరు నెలకు సంబంధించి రూ.2,15,04,500 నగదును బ్యాంకు నుంచి సచివాలయ అసిస్టెంట్‌లు శుక్రవారమే డ్రాచేశారు.

శనివారం ఉదయం 5గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు పింఛను నగదును పంపిణీ చేస్తారని ఎంపీడీవో ప్రభాకరశర్మ చెప్పారు. ఏదైనా కారణాలతో 30వ తేదీ పింఛన్ తీసుకోలేనివారికి సోమవారం అందజేస్తామని చెప్పారు. అప్పటికీ అందుబాటులో లేక ఎవరైనా తీసుకోని వారు ఉంటే జనవరిలో రెండు నెలల పింఛన్ నగదును ఇచ్చేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 30 నవంబరు 2024



కరెంట్‌కూ.. రీచార్జ్



రీచార్జి చేస్తేనే సెల్‌ఫోన్ పని చేస్తుంది.. లేదంటే ఎవరికైనా ఫోన్ చేయాలంటే కుదరదు.. ఇదే తరహాలో ఇక విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పుడు విద్యుత్ కనెక్షన్లకు ఉన్న మీటర్లను మార్చేస్తున్నారు. వాటి స్థానంలో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో స్మార్ట్‌మీటర్లను బిగించేశారు. వ్యాపార దుకాణాల్లో మీటర్లను మారుస్తున్నారు. ఆ తర్వాత పరిశ్రమలు, గృహాలకు మార్చనున్నట్లు సమాచారం. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను జూలై 2025 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా ఉంది. వ్యవసాయ మోటార్లకు మాత్రం స్మార్ట్‌మీటర్ల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ విధానంలో ఇక విద్యుత్ బకాయిలు పేరుకుపోవు.. ముందుగా చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అయ్యే పరిస్థితులు రానున్నాయి.

మొబైల్ అనుసంధానం

స్మార్ట్ మీటర్లకు వినియోగదారుడి మొబైల్‌ను అనుసంధానం చేస్తారు. వినియోగదారుడు తన మొబైల్‌లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడు చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా ఎంత మొత్తం కావాలంటే అంత నగదు రీచార్జి చేసుకోవాలి. ఎన్ని యూనిట్లు వినియోగం జరిగింది.. ఎంత రీచార్జి చేశారు.. ఎప్పుడు రీచార్జి గడువు ముగిస్తుంది.. వంటి సమగ్ర వివరాలు మొబైల్‌లోనే తెలుసుకోవచ్చు. రీచార్జి గడువు ముగిసే సమాచారం వినియోగదారుడి సెల్ నెంబర్‌కు సంక్షిప్త సమాచారం వస్తుంది.

- ముందుగా నగదు చెల్లిస్తేనే సరఫరా
- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం
- ఇప్పటికే వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి
- వ్యాపార దుకాణాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న వైనం
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 36,777 మీటర్ల ఏర్పాటు
- అన్ని కేటగిరీలకు తప్పనిసరి.. వ్యవసాయ మోటార్లకు మినహాయింపు
- జూలై 2025 లోపు స్మార్ట్ మీటర్ల బిగింపు పూర్తి చేయాలని లక్ష్యం



నరసరావుపేటలోని టీ స్టాల్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విద్యుత్ వినియోగంలో ఇక సాంకేతికత రానున్నది. మొబైల్ రీచార్జి తరహాలోనే విద్యుత్ సరఫరా వినియోగంలోకి రానున్నది. ఇందులో భాగంగా కేటగిరీల వారీగా స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వ్యవసాయ మీటర్లు మినహా అన్ని కేటగిరి సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే 36,777 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. వ్యాపార షాపుల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. మరో 15 రోజుల్లో వ్యాపార దుకాణాల్లో మీటర్ల ఏర్పాటు పూర్తి కానున్నది. తదుపరి దశలో పరిశ్రమల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 200 యూనిట్లు వినియోగంపై ఉన్న గృహ సర్వీసులకు, వాణిజ్య.. పరిశ్రమల సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో ఇంటికి రీడింగ్ బిల్లు రావడం.. దానిని కట్టడం ఇక ఉండవు. వినియోగదారులు ఎంత మొత్తం రీచార్జి చేసుకుంటే ఆ మొత్తం అయిపోయే వరకు కరెంట్ సరఫరా ఉంటుంది. చెల్లించిన మొత్తం పూర్తయిన తర్వాత వెంటనే సరఫరా ఆగిపోకుండా కొంత సమయం వరకు వెసులుబాటు ఉంటుంది. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కార్యాలయాలకు వెళ్లి క్యూలో నిల్చొని బిల్లులు కట్టాల్సిన పని ఉండదు. తమ సెల్‌ఫోన్లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని

జిల్లా	బిగించిన మీటర్లు
పల్నాడు	10,668
గుంటూరు	15,349
బాపట్ల	10,760

(మిగతా 6వ పేజీలో..)



- 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మార్పులు, చేర్పులకూ అవకాశం
- అర్హులందరికీ న్యాయం జరిగేలా ప్రక్రియ

కొత్త కార్డులొస్తున్నాయ్!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రేషన్ పంపిణీని ఓ ప్రహసనంగా మార్చేసిన ఘనత గత ప్రభుత్వానిది కాగా.. అర్హులకు రేషన్ కార్డులు అందించే విషయంలో కాలయాపనే తప్ప వారి ఎదురుచూపులు ఫలించలేదు. ఈ పరిస్థితుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడానికి కూటమి ప్రభుత్వం సమాయత్తమైంది. కొత్తగా రేషన్‌కార్డు కావాల్సిన వారు, రేషన్ కార్డుల్లో మార్పుల కోసం ఎదురుచూస్తున్న వారు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. వచ్చే నెల 2 నుంచి ప్రక్రియ ప్రారంభించి నెలాఖరు కల్లా పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి కొత్త కార్డులను లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఎంతోమందిని అనర్హులుగా...

వైసీపీ ప్రభుత్వం కొలువుదీరగానే గ్రామాల్లో ఉన్న రాజకీయ కారణాలతో చాలా మందిని బియ్యం కార్డుకు దూరం చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 7,000 మంది వరకు ఐదేళ్ల పాటు తమ కార్డును తిరిగి పునరుద్ధరించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి పోయారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న కార్డును రద్దు చేయడంతో వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులు ఐదేళ్లపాటు దూరంగా ఉండిపోవాల్సివచ్చింది. వివాహంతో పాటు ఇతరత్రా కారణాలతో కార్డుల విభజన చేసుకోవాలనుకున్న వారి వేదనను గత పాలకులు ఆలకించలేదు. దీంతో ఐదేళ్లపాటు చేర్పులు, మార్పులకు కూడా అవకాశమివ్వకుండా పాలన సాగించారు. ఈ ఇబ్బందులన్నింటికీ చెక్‌పెట్టేలా కూటమి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో అర్హతఉండీ సంక్షేమానికి దూరంగా ఉండిపోయిన కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రస్తుత కార్డులు 4,86,000

జిల్లాలో ప్రస్తుతం 1123 రేషన్‌షాపుల పరిధిలో 4,86,000 రేషన్‌కార్డులు ఉన్నాయి. అంత్యోదయ కార్డుల సంఖ్య 11,100గా ఉంది. కూటమి ప్రభుత్వం వీరందరికీ కొత్త డిజైన్లతో రేషన్‌కార్డులను సంక్రాంతికి అందించే విధంగా ప్రణాళికలు రచించింది. ఓ అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల కోసం 24,000 దరఖాస్తులు దాదాపు మూడేళ్లపాటు మోక్షానికి నోచుకోకుండా ఉండిపోయాయని సమాచారం. ఇలాంటి వారంతా ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే డిసెంబరు చివరికల్లా ఆ సమస్యను పరిష్కరించి కొత్త కార్డులు అందించే ఏర్పాటును ప్రభుత్వం చేపట్టింది. గత ప్రభుత్వంలో ఇబ్బడి ముబ్బడిగా అనర్హులను లబ్దిదారుల జాబితాలో చేర్చినట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. వచ్చేనెల నుంచి జరిగే ప్రక్రియలో భాగంగా అనర్హుల ఏరివేత కూడా జరగనుంది. అర్హులైన ఏఒక్కరికీ అన్యాయం జరగకూడదని కొత్తకార్డుల ప్రక్రియను పూర్తిచేయడానికి ప్రభుత్వం సంకల్పించింది.

రేషన్ తీసుకోని వారికెందుకు....

గతంలో వరుసగా మూడు నెలల పాటు రేషన్ తీసుకోని కార్డులపై కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 శాతం కార్డులకు సంబంధించిన లబ్ధిదారులు రేషన్ తీసుకోవడం లేదనే అంచనాకు యంత్రాంగం వచ్చింది. ఇటువంటి కార్డులను రద్దు చేసి మరింత మందికి లబ్ధి చేకూర్చాలనే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోంది.

రాజ్యసభ రేసులో.. గల్లా జయదేవ్

- అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎంపీ పేరు
- గత ఎన్నికల్లో పోటీకి దూరమైనా పార్టీపై విధేయత



గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో అడుగు పెట్టాలని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఉత్సాహ పడుతున్నారు. ఖాళీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీటు ఆశిస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు. గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు పర్యాయాలు విజయం సాధించిన జయదేవ్ మూడో పర్యాయం బరిలో నుంచి తప్పుకున్నారు. లోక్‌సభ సభ్యుడిగా ఉండి తనకున్న వ్యాపారాల మూలంగా ప్రజలకు అందుబాటులో ఉండలేకపోతున్నాననే భావనతో పాటు అప్పటి సీఎం జగన్ వేధింపుల నేపథ్యంలో రాజకీయాలంటేనే విరక్తి చెందారు. ఈ క్రమంలో గత ఎన్నికల్లో డాక్టర్ పెమ్మసానికి పోటీ చేసే అవకాశం లభించగా ఆయన గెలుపును కాంక్షిస్తూ కుటుంబ సమేతంగా గల్లా వచ్చి ఓటు కూడా వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు మంత్రి నారా లోకేశ్‌తో కూడా గతంలో లాగే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభలో అడుగుపెట్టాలనే ఆకాంక్షను ఆయన ఇప్పటికే చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వివాద రహితుడు, నిజాయితీ పరుడైన జయదేవ్ అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే కూటమిలో టీడీపీతో పాటు మరో రెండు పార్టీలు ఉన్నందున అటు పార్టీ, కుల సమీకరణలు బేరీజు వేసుకుంటూ రాజ్యసభ అభ్యర్థిత్వాలపై సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా లావణ్య

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కేఆర్‌ఆర్‌సీ(కోనేరు రంగారావు కమిటీ) విభాగానికి బాపట్ల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్.లావణ్యను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలిచ్చింది. జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వేగంగా అడుగులేస్తున్న సమయంలో ఈ నియామకం జరగడం గమనార్హం. అదే విధంగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా ఈ.మురళిని నియమిస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వెయిటింగ్‌లో ఉన్న ఎస్.లావణ్య, ఈ.మురళిలకు జిల్లాలో పోస్టింగ్‌లు దక్కాయి.

అమ్మో.. ఫెంగల్



కొల్లూరు: క్రాప అడ్డరోడ్డు వద్ద ఆరబోసిన ధాన్యాన్ని పట్టాలు కప్పుకునేందుకు గుట్టగా చేస్తున్న రైతులు



రేపల్లె: తుఫాన్ కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో ఒడ్డుకు చేరిన బోట్లు



బాపట్ల: పిట్టలవానిపాలెం మండలంలో వరి హార్వెస్ట్ చేస్తున్న దృశ్యం



కొల్లూరు: లారీకి లోడు చేసేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు



వేమూరు: చదలవాడ వద్ద గాలులకు పడిపోయిన వరి పైరు



అమృతలూరు: రోడ్డు వెంబడి ఆరబోసిన ధాన్యం

- తుఫాన్ ప్రభావం.. రైతుల్లో ఆందోళన
- ముప్పులేదన్నా ఈదురు గాలులు.. వర్షం
- కల్లాల్లో, రోడ్లపైన ధాన్యాన్ని తరలిస్తోన్న అన్నదాతలు
- మూడో రోజూ హార్బర్‌లో ఒకటో నెంబరు ప్రమాద సూచిక
- చేతికొచ్చిన పంట నోటికందదేమోనని భయపడుతున్న రైతులు

బాపట్ల, రేపల్లె, వేమూరు, భట్టిప్రో లు, కొల్లూరు, తెనాలి, కొల్లూరు, అమృతలూరు, గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం బలపడి తీవ్ర తుఫాన్‌గా మారింది. ఫెంగల్ పేరుతో దూసుకొస్తోన్న తుఫాన్ బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలపై ప్రభావం చూప దని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే బాపట్ల జిల్లా పరిధిలోని తీరప్రాంతంలో అలలు చిన్నపాటి స్థాయిలో పైకి వస్తున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్న హెచ్చరికలతో పడవలన్నీ ఒడ్డునే ఉన్నాయి. బాపట్ల, గుంటూరు జిల్లా ల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకాశం మేఘా వృతమైంది. తుఫాన్ ప్రభావంతో చలిగాలులు పగటి వేళల్లో కూడా ఎక్కువగా వీస్తున్నాయి. ఇక బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడ్డాయి. కోతకోసి ఆరబోసి రోడ్లపై, కల్లాల్లో ఉంచిన ధాన్యాన్ని వర్షం తడిపేసింది. రెండు రోజులుగా వాతావరణం ఎండ, మబ్బులతో దోబూచులాడుతున్నా వర్షం పడదన్న ధైర్యంతో రైతులు వరి కోతలు కోస్తున్న, ఇప్పటికే కోసిన వారు తుఫాన్ ప్రభావంతో వణికిపోతున్నారు. కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు వర్షంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వర్షం పడదన్న భరోసాతో ఉన్న రైతులను వర్షం నష్టపరిచింది. కొందరు ధాన్యపు రాశులపై పట్టాలు కప్పేసుకోగా మరికొందరు గోతాలకెత్తి మిల్లులకు తోలేందుకు సిద్ధమయ్యారు. కోత కోయకుండా ఉంచిన పైరు గాలులకు చాలాచోట్ల నేలవాలింది. కొల్లూరు మండలంలో 8 వేల ఎకరాల్లో సాగు చేయగా 1500 ఎకరాల్లో మాత్రమే వరికోతలయ్యాయి. భట్టిప్రోలు మండలంలో పది వేల ఎకరాల వరి సాగు చేపట్టగా, రెండు రోజులుగా కేవలం 500 ఎకరాల్లో మాత్రమే రైతులు కోతలు కోశారు. రేపల్లె నియోజకవర్గంలో 1.20 లక్షల ఎకరాలపైనే వరి సాగు చెయ్యగా 10 వేల ఎకరాల్లో కోతలయ్యాయి. బాపట్ల, కర్లపాలెం, పిట్టవానిపాలెం మండలాల్లో 53వేల ఎకరాల్లో వరిసాగవగా 30శాతం పైర్లు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో చిరుజల్లులతో పంట నేలవాలి గింజ కూడా దక్కదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ శాఖ మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతుందని హెచ్చరికలు జారి చేయడంతో అన్నదాతలు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో వచ్చిన వరదల వల్ల ఒకసారి నష్టపోయామని ఇప్పుడు వర్షాలు పడితే సొంతం మునగడం ఖాయమని రైతులు వాపోతున్నారు. తుఫాన్ కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో మూడో రోజైన శుక్రవారం ఒకటో నెంబరు ప్రమాదసూచిక కొనసాగుతుంది. సముద్రం కల్లోలంగా ఉండటంతో భయాందోళనతో వారం క్రితం వేటకు వెళ్ళిన బోట్లన్నీ సురక్షితంగా హార్బర్‌కు చేరుకున్నాయి.

యంత్రాలకు డిమాండ్

ముసురు నేపథ్యంలో నూర్పిడి యంత్రాలకు డిమాండ్ పెరిగింది. గతంలో ఎకరాకు తీసుకునే మొత్తం కంటే ఎకాఎకిన రూ.800వరకు పెంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వర్షం పడితే మొత్తానికే నష్టపోతామనే బెంగతో రైతులు భారవముతున్నా సరే లెక్క చేయకుండా కోతలు కోయిస్తున్నారు. వాతావరణ పరిస్థితి దృష్టిలో ఉంచుకుని చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు యంత్రాలతో రాత్రివేళల్లో సైతం పంటను కోత కోయించి ధాన్యాన్ని కొందరు భద్రపరుస్తున్నారు. రేపల్లె నియోజకవర్గంలో మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షంపడటంతో పైర్లు నేలవాలాయి. చెదురుమదురు గాలులతో నేలవాలిన పైర్లను కట్టులు కట్టేపనిలో రైతులు నిమగ్నమయ్యారు.

వరి కోయవద్దు

తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున రెండు, మూడు రోజుల పాటు వరి కోతలు కోయకుండా ఉండటం మంచిదని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. కోత కోసిన తర్వాత వర్షం కురిస్తే ధాన్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు కోత కోసిన ధాన్యం చాలా వరకు అమ్మకాలు జరిగాయన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అయ్యప్ప స్వాములకి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు

- శబరిమల యాత్రతోపాటు ఇతర క్షేత్రాలకు ప్రతిపాదనలు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్పస్వాములకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీలతో సిద్ధమైంది. అయ్యప్ప స్వాములకు స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసి అదనపు ఆదాయం కోసం టూర్ ప్యాకేజీలతో అందుబాటులో ఉంచుతున్నారు. శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములు ఒక బృందంగా చేరి 30 మంది స్వాములు ఉంటే వారికి ప్రత్యేక బస్సు సిద్ధం చేస్తామని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఎక్కడికైనా బస్సును అయ్యప్పస్వాముల వద్దకు పంపిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న బస్సుతోపాటు సుశిక్షితులైన డ్రైవర్‌లను యాత్ర బస్సులకు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గుంటూరు నుంచి బయల్దేరి..

శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్పస్వాములకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నారు. గుంటూరు నుంచి బయల్దేరి నేరుగా కాణిపాకం, అరుణాచలం, పళని, ఈషా టెంపుల్, గురువాయుర్, ఎరుమేలి, పంబ, సన్నిధానం అనంతరం తిరుగు పయనంలో త్రివేండ్రమ్, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తిరుచందుర్, శ్రీరంగం, శివకంచి, విష్ణు కంచి, శ్రీకాళహస్తి మొదలైన పుణ్యక్షేత్రాలను దర్శించుకుని గుంటూరు చేరుకుంటుంది. అయ్యప్పస్వాముల కోరికమేరకు సూపర్‌లగ్జరీ(2+2)పుష్‌బ్యాక్, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంచుతున్నారు. స్వాముల కోరిన క్షేత్రాలకు బస్సులు పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్యాకేజీ ధరలు

అయ్యప్ప స్వాములకు టూర్‌కు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు ఏడు రోజుల టూర్‌కు ప్యాకేజీ బస్సుకు రూ. 2,49,000 కాగా 10 రోజుల టూర్ ప్యాకేజీ రూ. 2,85,000, 12 రోజుల టూర్‌కి రూ. 3,34,000, అలానే అల్ట్రా డీలక్స్ బస్సుకి ఏడు రోజుల టూర్‌కి రూ.2,65,000, అదే పది రోజుల టూర్‌కి రూ. 3,02000 కాగా 12 రోజుల టూర్‌కి రూ.3,55,000 తెలిపారు.


పర్చూరు వద్ద హైవే నిర్మాణ పనులు

శరవేగంగా హైవే నిర్మాణం

పిడుగురాళ్ల నుంచి వాడరేవుకు

హైవే రోడ్డు ఏర్పాటు

పర్చూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పిడుగురాళ్ల నుంచి వాడరేవు వరకు దాదాపు 82 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా పర్చూరును అనుసంధానిస్తూ కారంచేడు మీదుగా వాడరేవు వరకు హైవే రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పర్చూరు-కారంచేడు మధ్య పనులు చకచకా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణంతోపాటు కల్వర్టులు, ఫ్లైఓవర్ ఏర్పాటుకు సంబంధించిన పనులు చేపట్టారు. పర్చూరు వైజంక్షన్‌లో ఫ్లైఓవర్‌ను నిర్మించే విధంగా ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆ కూడలిలో ఫ్లైఓవర్ పనులు చేపట్టారు. హైవే నిర్మాణంతో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణాకు సులువు కానుంది. అంతేగాక వాడరేవు ఉండటం వల్ల పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందనుంది. అదేవిధంగా వాణిజ్య వ్యాపార రంగం అభివృద్ధికి హైవే నిర్మాణం ఎంతగానో దోహదపడనుంది. ఇప్పటికే వాడరేవు-పిడుగురాళ్ల రహదారి నిర్మాణపు పనులతో పర్చూరు ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కాసేపు అరుపులు, చమత్కారాలతో ముగింపు

ఒక్క అంశంపై గంట సేపు రసాబాసా

ఇదీ చీరాల మున్సిపల్ సర్వసభ్య సమావేశం తీరు

చీరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు అరుపులు, కేకలకే ప్రాధాన్యత ఇచ్చారు. కాసేపు కేకలు, కాసేపు చమత్కారాలతో సభ హుందాతనాన్ని తగ్గించారు. అజెండాలోని 15వ అంశంలో పొందుపరిచిన 29వ వార్డులోని ఓ డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించిన చిన్న అంశంపై సుమారు గంటసేపు పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మధ్య రచ్చనడవడం గమనార్హం.

కమిషనర్ గారు.. మీరు రాజకీయ నాయకునిగా వ్యవహరించొద్దు

పట్టణంలో పలువురి విగ్రహాలకు ఏర్పాటుకు సంబంధించి చర్చ జరిగే సమయంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ కమిషనర్ గారు.. మీరు రాజకీయ నాయకుడిగా వ్యవహరించొద్దు.. పార్టీలు వేరైనా ఎవరి ప్రాధాన్యత వారికి ఉంటుంది.. ఎమ్మెల్యే సూచనలను తీసుకోండి.. అలాగే మాజీ మంత్రి పాలేటి రామారావు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఇచ్చిన అర్జీని అజెండాలో ఎందుకు పొందుపరచలేదు..? అబ్దుల్ కలాం, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు సంబంధించి నిర్దిష్టంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదా అంటూ ఆక్షేపించారు. దీనిపై కమిషనర్ అబ్దుల్‌రషీద్ స్పందిస్తూ తనపై ఆరోపణలు చేయవద్దని, అన్ని విషయాలు మీ దృష్టికి తీసుకొచ్చే నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. వాటికి సంబంధించి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని నిర్ణయం తీసుకుందామని కౌన్సిలర్ల వాద, ప్రతివాదనల అనంతరం ఒక అంగీకారానికి వచ్చారు.


మాట్లాడుతున్న చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

నేను చైర్మన్‌ని.. నువ్వు కౌన్సిలర్‌వి...

ప్రధానంగా 15వ అంశానికి సంబంధించి చర్చ సమయంలో కౌన్సిలర్ సత్యానందం, ఇతర కౌన్సిలర్లలో పలువురు పెద్ద, పెద్దగా మాట్లాడటంతో ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని చైర్మన్ చెప్పారు. ఆ క్రమంలో నేను లేస్తూనే ఉంటా.. మాట్లాడతానే ఉంటానంటూ సత్యానందం బిగ్గరగా చెప్పారు. నువ్వు లేస్తూనే ఉంటావు.. నేను కూర్చోవాలని అంటూనే ఉంటా.. నువ్వు కౌన్సిలర్‌వి, నేను చైర్మన్‌ను ఆ విషయం గుర్తుంచుకోవాలని జంజనం చెప్పారు.

ఆరు అంగుళాల్లో డ్రెయిన్ కడతారా..

29వ వార్డులో డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించి ఆ వార్డు కౌన్సిలర్ బత్తుల అనీల్ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉన్న మున్సిపల్ ప్లాన్ ప్రకారం అక్కడ రోడ్డు వెడల్పు 13.6 అడుగులు ఉందన్నారు. అందులో 13 అడుగుల రోడ్డు వేశారు. మిగిలిన ఆరు అంగుళాల్లో డ్రెయిన్ ఎలా కడతారని ప్రశ్నించారు. అక్కడ దశాబ్దాలుగా వివాదం నడుస్తోందన్నారు. పలు నిధులకు సంబంధించి కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, గుంటూరు ప్రభాకరరావు తదితరులు లేవనెత్తిన సమస్యలకు టీపీపీ శ్రీనివాసులు, డీఈ, కమిషనర్‌లు వివరణ ఇచ్చారు. అజెండాలోని మొత్తం అంశాలు 18 కాగా అందులో 4 అంశాలను వాయిదా వేశారు. 13 అంశాలను కొద్దిపాటి చర్చతో ఆమోదించారు. మంచినీటి కుళాయి పన్ను పెంపును అందరూ వ్యతిరేకించారు. ఆ అంశాన్ని పాత పద్ధతిలో యథాతథంగా కొనసాగించాలని సవరిస్తూ ఆమోదించారు.

ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాభివృద్ధి

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యం అని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి చెప్పారు. మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లడారు. రసాయన పురుగు మందులు ఎక్కువగా వాడడం వలన ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భూమి చౌడుబారుతుందని, భూమిలో సేంద్రియ కర్బనం పెరగాలంటే పచ్చిరొట్ట వేసి భూమిలో కలియదున్నాలన్నారు. విత్తనశుద్ధి కచ్చితంగా చేసుకోవాలని ఏడీఏ ధనరాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, వీఏఏ ఆజాద్, మోటుపల్లి నాగేశ్వరరావు, కామేపల్లి హనుమంతరావు, నాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో నేత్రదానం

ఇంకొల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన వెనిగండ్ల సుశీలమ్మ మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యశాల డాక్టర్లు.. మృతురాలి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు హనుమంతరావు, వెంకట్రావు, చంద్రశేఖర్‌లను కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామిలు అభినందించారు.

ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1 అంతర్జాతీయ ఎ యిడ్స్ దినం సందర్భంగా శుక్రవారం అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీ, పసుమర్తిపాలెంలో జిల్లా హెచ్ఐవి, ఎ యిడ్స్ నిర్మూలన సంస్థ, హెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, కిషోర బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా గ్రామాలల్లో వివిధ కార్యక్రమాల ద్వారా అ వగాహన కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కర్‌లు కరుణ, శ్రావణి, మల్లేశ్వరి, శి వ పార్వతి తదితరులు పాల్గొని నిర్వహించారు.

ప్రసన్నాంజనేయ సన్నిధిలో కార్తీక దీపోత్సవం


కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుకవారం సాయంత్రం కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. లక్కవరం స్వామిజీచే జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేసుకున్నారు.

జాబ్ మేళాలో 21 మంది ఉద్యోగాలకు ఎంపిక


మాట్లాడుతున్న అధికారులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 41 మంది అభ్యర్థులు రాగా వారిలో 21 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారని జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి పి. ప్రణయ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపినాథ్, శ్రీకాంత్, వినోద్ పాల్గొన్నారు.

ఒంగోలులో రెండు రైళ్ల నిలుపుదల

ఒంగోలు కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి విజ్ఞప్తి మేరకు 02121, 02122 జబల్పూర్- మధురై ఎక్స్‌ప్రెస్, 04717, 04718 తిరుపతి- జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఒంగోలులో నిలుపుదల చేస్తారు.

రీసర్వే సంకటం

ఆయా గ్రామాల్లో వేధిస్తున్న సమస్యలు

మూడేళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లు

క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న గ్రామస్థులు

పథకాలకు దూరమవుతున్న రైతులు

బ్యాంకుల్లో రుణాలు కూడా పొందలేని దుస్థితి

గ్రామసభలు నిర్వహించినా పరిష్కారం శూన్యం


ఈ రైతు పేరు రాయ ఈశ్వరరెడ్డి. తర్లుపాడు మండలం కారుమానుపల్లి గ్రామం. ఈయనకు వారసత్వంగా రెండెకరాలు వచ్చింది. ఈ భూమిలో మూడేళ్లుగా మిరప సాగు చేశారు. కాలం కలిసి రాకపోవడంతో రూ.2లక్షల మేర నష్టపోయారు. అప్పులు తీర్చేందుకు పొలం అమ్ముదామని ప్రయత్నిస్తే ఎవరూ కొనడం లేదు. రీసర్వే జరిగిన గ్రామం కావడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అటు పొలం అమ్ముకోలేక, ఇటు అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనలో కొట్టుమిట్టాడుతున్నారు.


పేరు పిన్నిక శ్రీనివాసులు. మార్కాపురం మండలం శివరాంపురంలో ఈయనకు 2.10 ఎకరాల పొలం ఉంది. ఆ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా తొలుత రీసర్వే చేశారు. ఆయన పొలం పక్కనే ఉన్న బంధువులకు చెందిన ఎకరం భూమిని రెండేళ్ల క్రితం కొన్నాడు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి కార్యాలయానికి వెళ్తే చుక్కెదురైంది. మీ గ్రామంలోని భూములు ఆన్‌లైన్‌లో చూపడం లేదు కాబట్టి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కష్టమని అధికారులు చెప్పారు. కొన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయుంచుకోలేక శ్రీనివాసులు అవస్థలు పడుతున్నారు.

- ఇదీ జిల్లాలో రీసర్వే చేసిన గ్రామాల్లో పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల రీసర్వే ప్రక్రియ నేడు ప్రజలకు శాపంగా మారింది. నాలుగు ఫేజ్‌లలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో రైతుల కష్టాలు తీరకపోగా పలు నూతన సమస్యలు తీసుకొచ్చింది. మూడు సంవత్సరాల నుంచి ఇంకా ఆ సమస్యలన్నీ అపరిష్కృతంగానే ఉన్నాయి. ఏ మాత్రం తేడా ఉన్నా ఆయా భూములు ఆన్‌లైన్ కనిపించడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్లు కావడం లేదు. అలాగే పథకాలకు ఇబ్బందిగా మారింది. రుణాలు అందడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. ఆ కార్యక్రమంతో భూములపై పారదర్శకత వస్తుందని, వివాదాలు సమసిపోతాయని గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు హడావుడి చేయగా, వాస్తవంలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. అంతా అస్తవ్యస్తంగా తయారైంది. ఏమీ చేయలేక అధికారులు ఆన్‌లైన్ నిలిపివేశారు. దాంతో భూముల క్రయవిక్రయాలు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూములు అమ్ముకోవాలనే వాళ్లు, ఇప్పటికే అమ్ముకున్న వాళ్లు రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో అవస్థల పాలయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని సడలింపులు ఇచ్చి రీసర్వే జరిగిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు అనుమతులిచ్చింది. కొద్దిరోజులపాటు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే ఇతర జిల్లాల్లో యథావిధిగానే జరుగుతున్నా, రెండు మాసాల నుంచి మన జిల్లాలో మాత్రం రిజిస్ట్రేషన్లు నిలిపేశారు. పలు రకాలైన సాంకేతిక కారణాలను చూపి ఆ శాఖాధికారులు క్రయవిక్రయదారులకు మొండిచేయి చూపుతున్నారు. దీంతో జిల్లాలో రీసర్వే జరిగిన గ్రామాల్లోని ప్రజలు లబోదిబోమంటున్నారు.

ఎల్‌పీ నంబర్లపై నిలిచిన రిజిస్ట్రేషన్‌లు

రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే నంబర్ల బదులు నూతనంగా ఎల్‌పీ(ల్యాండ్ పార్శిల్) నంబర్‌ను గత ప్రభుత్వం ఆన్‌లైన్‌లలో ఉంచింది. ఈ నూతన ప్రక్రియతో పలు రకాలైన చిక్కులు ఏర్పడ్డాయి. ఒక సర్వే నంబర్‌లో పలు సబ్ డివిజన్‌లు ఉన్నా చాలా చోట్ల అన్నింటికి కలిపి ఒకే ఎల్‌పీ నంబర్ కేటాయించారు. అందులో ఒకరు భూమి అమ్ముకోవాలన్నా, అందరి భూవిస్తీర్ణం చూపుతుంది. దీంతో రిజిస్ట్రేషన్ల సమయంలో అయోమయ పరిస్థితులు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరి సర్వే నంబర్లపై రిజిస్ట్రేషన్‌లు చేయాలంటే వెబ్‌ల్యాండ్‌లో నిషేధిత భూముల జాబితాలో ఆయా నంబర్లను చూపుతున్నారు. దీంతో ఏ సమస్య లేని భూముల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేయడం కుదరడం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఎల్‌పీ నంబర్ నమోదు చేస్తే రిజెక్ట్ చేస్తోంది. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఎవరూ చొరవ చూపకపోవడంతో రీసర్వే గ్రామాల్లోని ప్రజలు ఏం చేయాలో తెలియక తీవ్ర ఆవేదనకు గురికావాల్సి వస్తోంది.

బ్యాంకుల్లో రుణాలకు చుక్కెదురు

రీసర్వే గ్రామాల ప్రజలు భూమి తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్నా కుదరడం లేదు. బ్యాంకులో రుణం పొందాలంటే పట్టాదారు పాస్‌బుక్‌తోపాటు 1బీ, అడంగల్ తప్పనిసరి. పాస్‌బుక్ ఉన్నా వెబ్‌ల్యాండ్ నుంచి 1బీ, అడంగల్‌లు రావడం లేదు. చివరికి కొందరు బ్యాంకర్లు చొరవ తీసుకుని తహసీల్దార్ నుంచి మాన్యువల్‌గా తెచ్చుకోండి రుణాలిస్తామన్నా.. రెవెన్యూ అధికారులు అందుకు సహకరించడం లేదు. అంతేకాక ఇప్పటికే రుణాలు తీసుకొని ఉన్న రైతులు కూడా పలు రకాలైన అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం రైతులు వడ్డీ చెల్లించి రుణాలను రీషెడ్యూల్ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ ఎప్పటికప్పుడు 1బీ, అడంగల్‌లు బ్యాంకుకు సమర్పించాలి. అక్కడ వెబ్‌ల్యాండ్ నుంచి అవి రాకపోవడంతో రుణాలను రీషెడ్యూల్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలామంది ఏళ్లుగా తీసుకున్న రుణాలకు వడ్డీలు కూడా చెల్లించకపోవడంతో డిఫాల్టర్ల జాబితాలో చేరుతున్నారు.

గ్రామసభలు పెట్టినా ఫలితం శూన్యమే

రీసర్వే చేసిన గ్రామాల్లో ఎక్కువగా తప్పులు దొర్లాయి. ప్రజల నుంచి ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఎక్కువసంఖ్యలో ఫిర్యాదులు అందాయి. దీంతో నూతన ప్రభుత్వం గత నెలలో గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరించింది. ప్రతి గ్రామంలోనూ సుమారు 80శాతం మేర తప్పులు దొర్లాయని వాటిని సరిచేయాలని ప్రజలు అర్జీలు అందజేశారు. అంతవరకు బాగానే ఉన్నా తప్పులను సరిచేయడానికి వెబ్‌ల్యాండ్ సైట్ ఓపెన్ కావడం లేదు. తహసీల్దార్‌లకు లాగిన్ ఇవ్వకపోవడంతో అర్జీలను పరిష్కరించలేని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిసారించి రీసర్వే జరిగిన గ్రామాల ప్రజల కష్టాలను పరిష్కరించాలని కోరుతున్నారు.

కరెంట్‌కూ.. రీచార్జి

(5వ పేజీ తరువాయి...)

అందులో తమ సర్వీసు నంబరును నమోదు చేసుకుని కట్టవచ్చు. ఎప్పటికప్పుడు యాప్ ద్వారా తమకున్న విద్యుత్ సర్వీసుకు రీచార్జి చేసుకునే సౌకర్యం ఉంటుంది. దీనివల్ల అపరాధ రుసుం చెల్లించే పరిస్థితి ఉండదు. మీటర్ రీడింగ్ తీసే సమయంలో తప్పులు దొర్లే పరిస్థితి ఉండదు. స్మార్ట్ మీటర్‌లో ఏర్పాటు చేసిన ఇన్ బిల్ట్ సిమ్ ద్వారా ఎప్పటికప్పుడు మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల్లో లక్షల మేర మీటర్ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. వ్యవసాయం మినహా అన్ని కేటగిరి సర్వీసులకు మీటర్లు బిగింపు తప్పని సరి చేస్తున్నారు.

వినియోగదారులకు అవగాహన

విద్యుత్ వినియోగం 200 యూనిట్లకుపైగా ఉన్న గృహ వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లను బిగించనున్నారు. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలకు పూర్తియిన వెంటనే గృహాలకు మీటర్ల బిగింపునకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. మీటర్ల బిగింపు పూర్తయితే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలు.. అధిక బిల్లు తదితరాలపై వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే జూలై నుంచి స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి రానున్నాయి. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న విధానంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ బిగించినా దానిని యాక్టివేట్ చేయలేదని చెబుతున్నారు. మీటర్ల ఏర్పాటు పూర్తయిన వెనువెంటనే రీచార్జి విధానం అమల్లోకి రానున్నది.

విద్యుత్ చోరీకి చెక్

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ద్వారా విద్యుత్ చౌర్యం కూడా తెలిసిపోతుంది. ఎక్కడ విద్యుత్‌చౌర్యం జరుగుతుందో గుర్తించే విలుంటుందని అధికారులు చెబుతున్నారు. 11 కేవీ, 33 కేవీ ఫీడర్లు, అధిక సామర్థ్యం గత నియంత్రికల వద్ద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల ఎంత విద్యుత్ సరఫరా అవుతోంది, వినియోగం, వృథా ఎంత వంటి వివరాలు ఆయా మీటర్లలో ఉన్న సిమ్‌లలో నమోదవుతుంది. ఫీడర్ నియంత్రికలపై హెచ్చు, తగ్గుల సరఫరా అవుతున్నా యాప్‌లో నమోదు అవుతుంది.

రూ.100 కోట్లతో పాలేరు, ముసిలో మేట తొలగింపు

మారిటైం బోర్డుకు ప్రతిపాదనలు

కోరిన చైర్మన్ దామచర్ల సత్య

పలు అంశాలపై కలెక్టర్, ఇతర అధికారులతో చర్చ

ఒంగోలు, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాలేరు, ముసి నదులు సముద్రంలో కలిసే ప్రాంతంలో భారీగా మేట వేసిన ఇసుకను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నారాయణ(సత్య) జిల్లా యంత్రాంగాన్ని కోరారు. అందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలను మారిటైం బోర్డుకు పంపాలని సూచించారు. జిల్లాలో ఆక్వా సాగు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్ తదితర మారిటైం బోర్డు పరిధిలోని అంశాలతో పాటు పాలేరు, ముసి నదులలో ఇసుక మేటల తొలగింపు ప్రాధాన్యతలపై శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, మత్స్య శాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి చర్చించారు. పాలేరు, ముసిలలో ఇసుక మేటలతో సముద్రం నీరు వాగులోకి ఎదురు రాక ఆ ప్రాంతంలోని ఆక్వా సాగుదారులు ఇబ్బందిపడుతున్నారని, అలాగే ఎగువ నుంచి వచ్చే సమయంలో ప్రవాహం అధికంగా వచ్చినపుడు పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అందువల్ల ఇసుక మేటలు తొలగింపు అవసరాన్ని గుర్తించి ప్రతిపాదించాలని కోరారు. ప్రాథమికంగా ఇందుకోసం రూ.100 కోట్లు అవసరమయ్యే అవకాశం ఉందన్న విషయం చర్చ రాగా ఆ మేరకు మారిటైం బోర్డుకు ప్రతిపాదనలు పంపితే నిధులు కల్పనకు కృషిచేస్తామన్నారు. అలాగే పాకలలో రూ.5కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలపై సమీక్ష చేశారు. కొత్తపట్నం సమీపంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా జిల్లాలో ఆక్వాసాగు అభివృద్ధి తద్వారా ఉపాధి కల్పన అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆ రంగం మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పంట ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

దైవాలరావూరులో వైభవంగా ఏకాహం

మేదరమెట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు శ్రీహరసాయి హనుమత్ క్షేత్రంలోని ఉమామహేశ్వర ఆలయంలో 24గంటలపాటు(ఏకాహం) శివనామస్మరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం శుక్రవారం వేకువజాము నుంచి ఆలయ పూజారి రాజశేఖరశర్మ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారు అర్ధనారీశ్వర అలంకారంలో భక్తుల పూజలందుకున్నారు. సాయంత్రం కోటి దీపోత్సవంతో పాటు అఖండ కర్పూర దీపారాధన(11కేజీలు) నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


అర్ధనారీశ్వర అలంకారంలో ఉమామహేశ్వరస్వామి

జిల్లాపై తుఫాన్ ప్రభావం

పలుచోట్ల జల్లులు,

నేడు ఒక మోస్తరు వానలు పడే అవకాశం

ఒంగోలు, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పినప్పటికీ ప్రభావం మాత్రం కనిపిస్తోంది. రెండు, మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి చలి గాలుల తీవ్రత పెరగ్గా శుక్రవారం అధికమయ్యాయి. అదే సమయంలో తుఫాన్ ప్రభావంతో శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో ప్రత్యేకించి తూర్పు, దక్షిణ ప్రాంతాలలో జల్లులు ప్రారంభం అయ్యాయి. శనివారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కొన్ని చోట్ల పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితమే శ్రీలంక, తమిళనాడుల మధ్య అల్పపీడనం ఏర్పడి క్రమంగా బలపడుతూ తుఫాన్‌గా మారింది. దానికి ఫెంగల్ అని పేరు పెట్టారు. తొలుత చెన్నైకి సమీపంలో ఉత్తర ప్రాంతంలో తుఫానుగా మారి తీరం దాటుతుందని దీనివల్ల జిల్లాలో శుక్రవారం నుంచి మూడు రోజులుపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. తద్వారా జిల్లాపై ఫెంగల్ ముప్పు ఉంటుందని భావించారు. అయితే తుఫాన్ దిశ మారడంతో జిల్లాకు ముప్పు తప్పిందని శుక్రవారం సాయంత్రం ఆరుగంటలకు చెన్నైకి ఆగ్నేయంగా 388కి.మీ దూరంలో ఉంది. శనివారం మధ్యాహ్నంకు తమిళనాడులోని కరైకల్- మహాబలిపురం ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉండగా రాష్ట్రంలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలపై అధిక ప్రభావం చూపనుంది.

ప్రారంభమైన జల్లులు

ఒక రకంగా జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పిపోగా శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో వర్షం ప్రారంభమైంది. ఒంగోలు, కొండపి, ఎస్ఎన్ పాడు నియోజకవర్గాలతో పాటు కనిగిరి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. శనివారం ఒక మోస్తరు వానలే పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారం. అయితే వర్షం కొన్ని ప్రాంతాలలో అవసరం కాగా కొద్దిపాటిగా పడితే ఉపయోగమేకాని ఎక్కువగా కురిస్తే మాత్రం తీవ్రగా నష్టపోతామని రైతులు చెప్తున్నారు భారీ వర్షం పడితే ఇటీవల వేసిన పొగాకు, శనగ దెబ్బతినే అవకాశంతో పాటు తూర్పు ప్రాంతంలో ఆ పంటలు సాగు మరింత ఆలస్యం అవుతుంది.

పెరిగిన చలి తీవ్రత

ఇదిలా ఉండగా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. తెల్లవారు జాము నుంచి చలి అధికంగా ఉంటుండగా తూర్పు దక్షిణ ప్రాంతంలో పగటిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గి మబ్బులు కమ్మి చలిగాలులు వీస్తున్నాయి. అదేసమయంలో పొలంలో ఉన్న పంటలపై తెగుళ్ల దాడి పెరిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి, మొక్కజొన్న, వరి, పొగాకు వంటి పంటలపై తెగుళ్ల తీవ్రత పెరిగింది. పూతకు వచ్చిన కంది పంటపై కూడా పలు ప్రాంతాలలో పురుగు తాకిడి పెరిగినట్లు చెప్తున్నారు. మొత్తం మీద పంటలపై వర్షాల కన్నా చలి వాతావరణం ప్రభావం అధికంగా కనిపిస్తోంది.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులుగా నియామకం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లకు శుక్రవారం ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా జే.పార్థసారథిని నియమించింది. అలాగే మరో డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన కే. ఆదెయ్యను హెచ్ అండ్ ఎఫ్ డబ్ల్యూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించింది.

అద్దంకిలో నేడు...

అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు శనివారం ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎల్. ఏస్తేరమ్మ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమీషన్ డి. రవీంద్ర తెలిపారు. కావున కౌన్సిల్ సభ్యులు అందరు హజరు కావాలని కోరారు.

అర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభా మూర్తులు-మధురస్మృతులు కార్యక్రమం జరుగుతుందని బాధ్యులు పీసీ హెచ్ కోటయ్య తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏ నెలలో అయినా 1వ తేదీ సెలవు రోజు అయితే ఎన్‌టీఆర్ రైతు భరోసా పింఛన్ ముందు నెల చివరి రోజున పంపిణీ చేస్తామని, డిసెంబరు 1వ తేదీ ఆదివారం వచ్చినందున పింఛన్‌లు నవంబరు 30వ తేదీ పంపిణీ చేస్తామని, లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ సొమ్ము పొందాలని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. -అద్దంకిటౌన్

గోశాలకు ట్రాక్టర్ వరి గడ్డి అందజేత



గడ్డిని అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని గోశాలకు టాక్టర్ వరి గడ్డిని శుక్రవారం అందజేశారు. విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయుడు నాగయ్య, రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో అద్దంకిలోని హరిహర గోశాలకు ఒక ట్రాక్టర్ వరి గడ్డిని అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, ఆంజనేయులు, గాడేపల్లి దివాకర్‌దత్తు పాల్గొన్నారు.

చిదంబరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో స్వామికి లక్ష బిల్వార్చనతో శుక్రవారం పూజలు నిర్వహించారు. కార్తీక మాసశివరాత్రి సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయంలోని చిదంబరేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. తదనంతరం లక్ష బిల్వార్చన(మారేడు దళాలు) పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ట్రాఫిక్ సమస్య.. పరిష్కారపు అడుగులు



మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చీరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వన్‌టౌన్ సీఐ మారీడు శ్రీనివాసరావు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నిత్యం రద్దీగా ఉంటే ప్రాంతాలను ఎంచుకుని పరిష్కార చర్యలు తీసుకున్నారు. మార్కెట్ సెంటర్లో పండ్లు, పూల వ్యాపారుల దుకాణాలను ఒక క్రమపద్ధతిలో పెట్టించారు. రోడ్డు మధ్యలో ఓ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ చెప్పినట్లైంది. ఎల్ఐసీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సుల పార్కింగ్‌కు సంబంధించి కొన్ని నిర్దిష్ట సూచనలు చేశారు. ఇదే క్రమంలో పట్టణంలోని ఇతర జనసమర్ధ ప్రదేశాల్లో ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికపై అత్యాచారయత్నం

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన 60 ఏళ్ల వ్యక్తిపై చినగంజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఒక గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక ఇంటి ముందు ఆడుతుండగా, అదే గ్రామానికి చెందిన వ్యక్తి వారి ఇళ్లకు సమీపంలోని జొన్న పంటలోకి ఈ నెల 26వ తేదీ ఉదయం ఆ బాలికను తీసుకొని వెళ్లాడు. అతను అత్యాచార యత్నం చేయబోతుండగా బాలిక కేకలు వేయడంతో అటుగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు కేకలు విని రావడంతో అతను పారిపోయాడు. ఉపాధి హామీ కూలీలు బాలికను వాళ్ల ఇంటి దగ్గర విడిచిపెట్టారు. బాలిక తల్లిదండ్రులు గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుక్రవారం తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

డ్రైనేజ, తాగునీటి సమస్యలు పరిష్కరించండి

కొరిశపాడులోని ప్రజావేదిక కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి



మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగు నెలల పాలనలో రాష్ట్రానికి 60 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అప్పులు చేయడం తప్ప సంపద సృష్టించడం చేతకాని జగన్‌రెడ్డి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయినా, ఇప్పటికీ అబద్దాలతో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి పంచాయతీ నిధులను ఉపయోగించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ వెయ్యి రూపాయలు పెంచడం, అన్న క్యాంటిన్‌లు తెరవడం, దీపం పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం, రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం చేస్తున్నామన్నారు. తాగునీటి స్కీమ్‌ల నిర్వహణకు 40శాతం లెస్ టెండర్లు వేస్తున్నారని, పనులు నాణ్యతతో చేస్తేనే బిల్లులు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావును ఆదేశించారు. పలుగ్రామాలకు చెందిన రైతులు రీసర్వేలో తమ భూమి తమ పేరుతో లేకుండా పోయిందని ఫిర్యాదు చేశారు. రీసర్వే కారణంగా వచ్చిన సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారించాలని తహసీల్దార్ సుబ్బారెడ్డిని ఆదేశించారు. గ్రామాల్లో లోవోల్టేజి సమస్య తలెత్తకుండా అవసరమైనన్ని ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలని ఈఈ మస్తాన్‌రావుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీపీ సాదినేని ప్రసన్న కుమారి, జడ్పీటీసీ సభ్యుడు తుళ్లూరి వెంకట రమణ, ఎంపీడీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



రుద్రాంశ సంభూతుడుగా అంజన్న

అంజన్నకు రుద్రాంశసంభూతుడు అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. కార్తీక మాసం మాసశివరాత్రి సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని రుద్రాక్షమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. - అద్దంకి టౌన్

3 క్వింటాళ్ల కర్పూరంతో అఖండజ్యోతి

శివనామస్మరణతో మారుమోగిన దుర్గామల్లీశ్వరి దేవస్థానం ప్రాంగణం

భక్తులు భారీగా రాక

మార్టూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓం నమశ్శివాయ, శంభోశంకర, హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల నినాదాలతో శుక్రవారం రాత్రి జాతీయరహదారి పక్కన శ్రీదుర్గామల్లీశ్వరి దేవస్థానం ప్రాంగణం మారుమోగింది. కార్తీకమాసంలో ఏటా ఈ దేవస్థానంలో భారీగా కర్పూరంతో భక్తులు అఖండ కర్పూరజ్యోతిని వెలిగిస్తారు. అఖండ కర్పూరజ్యోతిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో 3 క్వింటాళ్ల కర్పూరంతో అఖండ కర్పూరజ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమానికి తొలుత బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 2 క్వింటాళ్ల బంతి, చామంతి, మల్లి, లిల్లీ తదితర పూలతో దేవస్థానం ప్రాంగణంలో స్వామి రూపాలను, వేంకటేశ్వర స్వామి శంకుచక్రం రూపంలో అందంగా అలంకరించారు. అదేవిధంగా దేవస్థానంలో స్వామిని, అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వెలిగించిన అఖండ కర్పూరజ్యోతిని భక్తులు తనవితీరా దర్శించుకొని నమస్కారాలు చేసుకున్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఐ శేషగిరిరావు బందోబస్తు ఏర్పాటుచేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మాలధారులకు భిక్షను ఏర్పాటు చేశారు.



దేవస్థానం వద్దపూలతో అలంకరణ



దేవస్థానం ఆవరణలో వెలిగించిన అఖండ కర్పూరజ్యోతి



మరుగుదొడ్ల ప్రాధాన్యతను గుర్తించండి

అవీఇవీ

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మరుగుదొడ్ల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎంపీడీవో స్వరూపారాణి చెప్పారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పంగులూరులో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎంపీడీవో ప్రారంభించారు. బహిరంగ ప్రదేశాలలో మల మూత్రవిసర్జన వలన కలిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, పంచాయితీ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

రాజుపాలెంలో పెరిగిన కుక్కల బెడద



వీధులలో ఊరకుక్కలు

మార్టూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం వీధులలో కుక్కల బెడద ఎక్కువైందని గ్రామస్థులు వాపోతున్నారు. ముఖ్యంగా వారం రోజుల నుంచి గ్రామంలో కుక్కలు సంచారం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. రాత్రి సమయాలలో ద్విచక్రవాహనదారులను వెంబడిస్తున్నాయని, నడిచిపోయే వ్యక్తులపై ఎగబడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు భయబ్రాంతులకు గురవుతున్నారని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ వారు కుక్కల బెడదను నివారించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పశు వైద్యనిపుణులు సోమశేఖర్‌కు సత్కారం



డాక్టరు సోమశేఖర్‌ను సత్కరిస్తున్న రైతుసంఘం ప్రతినిధులు

మార్టూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొల్లాపల్లి గ్రామ నరసింహస్వామి దేవస్థానంలో ఏడాది క్రితం ఒక ఆవుకు కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా ఇటీవల ఒంగోలు గిత్త జన్మించింది. ఆవుకు చికిత్స చేసిన డాక్టరు సోమశేఖర్‌ను శుక్రవారం బొల్లాపల్లి గ్రామంలో రైతుసంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రైతుసంఘం నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా డీఎహెచ్‌వో డాక్టరు వేణుగోపాల్, మార్టూరు ఏహెచ్ ఏడీ డాక్టరు టీవీ నరసింహారావు, పశువైద్యాధికారి మాధవీలత, రైతుసంఘం నాయకులు తలపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, బోడెపాటి సూరిబాబులు పాల్గొని సోమశేఖర్ సేవలను కొనియాడారు.

గురుకుల పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్



చిన్నారులతో కలసి భోజనం చేస్తున్న డాక్టర్ మహేంద్ర

వేటపాలెం(చీరాల), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ చెప్పారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో కలసి తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయడమేగాక వారితో కలసి భోజనం చేశారు. అనంతరం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మహేంద్రనాథ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దోగిపర్తి బాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

డీఎస్పీ మహ్మద్ మొయిన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహ్మద్ మొయిన్

చీరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ మహ్మద్ మొయిన్ చెప్పారు. డిసెంబర్ 1వ తేదీ అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మహిళా మండలి సమావేశ మందిరంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ప్రాజెక్టు డైరెక్టర్ బి.వి. సాగర్ అధ్యక్షతన రూరల్, పట్టణ మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి ప్రోగ్రామ్ మేనేజర్ కె. వెంకట్రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో సామూహిక వ్రత మహోత్సవం



పూజాకార్యక్రమంలో భక్తులు

పర్చూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పర్చూరులో రూపుదిద్దుకొంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి, అనఘాదత్త స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ నిర్వాహకులు పాబోలు సత్యనారాయణ నేతృత్వంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. అందులో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న దంపతులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాబోలు లక్ష్మీన్నారాయణ, కొత్తూరి వీరాంజనేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి లగడపాటి శంకర్, కాసా అశోక్ కుమార్ తదితరులు ఆర్థిక సహకారం అందజేశారు.

సేంద్రియ ఎరువులను తప్పనిసరిగా వాడండి



సాగు పద్ధతులపై మాట్లాడుతున్న రత్నకుమారి

మేదరమెట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శనగ, మినుము సాగు చేసే రైతులు దుక్కిలో సేంద్రియ ఎరువులను తప్పనిసరిగా వాడాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు టి. రత్నకుమారి చెప్పారు. శుక్రవారం మేదరమెట్లలో రైతులకు శనగ, మినుము సాగు పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి రత్నకుమారితో పాటు ఏడీఏ కె. ధన్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుక్కిలో సేంద్రియ ఎరువులతో పాటు భాస్వరం వేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. సుక్ష్మ పోషకాల లోపాలను కూడా సవరించుకోవచ్చని చెప్పారు. రైతులు అందరూ పంట నమోదు చేయించుకుని, పంటల బీ మా చేసుకోవాలని ఏడీఏ ధన్‌రాజ్ చెప్పారు. పొగాకు బదులు జొన్న, మొక్కజొన్న వంటి అపరాల పంటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వీఏవోలు శ్రీలేఖ, షరీఫ్, సంతోష్, హసీనా పాల్గొన్నారు.

'పాఠశాలలో వనభోజనాలు భేష్'



వనభోజనాలు చేస్తున్న విద్యార్థులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో వనభోజనాలు కార్యక్రమం మంచి ఆహ్లాదకరంగా ఉంటుందని, విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని ఎంఈవో బి. సుధాకరరావు చెప్పారు. మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అందరూ కలిసి కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం విద్యార్థులతో కలిసి వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో సుధాకరరావు హాజరై ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఇక ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని హెచ్‌ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి చెప్పారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు పొతినేని శంకరరావు విద్యార్థుల తాగునీటికి కోసం అవసరమైన వాటర్ బాటిల్స్‌ను అందజేశారు.

ఆధార్ నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలి

బల్లికురవ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : ఆధార్ నమోదులో తప్పులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి చెప్పారు. బల్లికురవ మండలం ఉప్పమాగులూరు గ్రామంలోని సచివాలయంలో చేపడుతున్న ఆధార్ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. నూతనంగా ఆధార్ కార్డును ఇచ్చేటప్పుడు పేర్లు తప్పులు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. గతంలో ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరిదిద్దుకునేందుకు చేసుకున్న దరకాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమ కుమారి

కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా చంద్రలీల

● టీజీపీ స్పెషల్ కలెక్టర్ పీఏగా మురళి

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : జిల్లా కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బి. చంద్రలీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఏ. మురళిని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ పీఏగా, డిప్యూటీ కలెక్టర్ బి.మహేశ్వరరెడ్డిని నెల్లూరులోని జీజీహెచ్ పరిపాలనాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం..

బడుల్లో పండుగ

● వచ్చే నెల 7న మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం
● విద్యాపరమైన అంశాలపై చర్చ
● ఆటల పోటీలు, సహపంక్తి భోజనాలు
● జిల్లాకు రూ.48 లక్షల మంజూరు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చనుంది. విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, శుభతిథి పేరుతో సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందచేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు శుభతిథి పేరుతో వచ్చే నెల 7వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

6

నేటి నుంచే పింఛన్ల పంపిణీ

1వతేదీ ఆదివారం కావడంతో ముందే..!

మిగిలిన వారికి సోమవారం అందజేత

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెలా 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పేరుతో అందిస్తున్న సామాజిక పింఛన్లను డిసెంబరు నెలకు సంబంధించి నవంబరు 30 నుంచే పంపిణీ చేయనుంది. 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ముందురోజే పెన్షన్లను అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ముందస్తుగా నిధుల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉండగా ఎవరైనా పింఛనుదారులు వివిధ కారణాలతో వరుసగా రెండు నెలలు అందుబాటులో ఉండకపోతే మూడో నెలలో మొత్తం మూడు మాసాల పింఛను పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ విధానం అమలులో ఉన్నప్పటికీ ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని రద్దు చేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఆ విధానాన్ని పునరుద్ధరించింది. మొదటి వారంలో ఊర్లకు వెళ్లేవారు, వలస కార్మికులకు ఈ విధానంతో మేలు జరగనుంది. కాగా, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 3,09,997 మందికి రూ.131.62 కోట్లను పెన్షన్‌గా ప్రభుత్వం అందిస్తోంది. ఈ పింఛన్ల పంపిణీకి సుమారు 7 వేల మంది సచివాలయ సిబ్బందిని వినియోగిస్తోంది. వారు శనివారం ఉదయం 6 గంటలకే పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేసేలా ఏర్పాట్లు చేసింది. తొలిరోజు పింఛను అందని వారికి డిసెంబరు 2వ తేదీ సోమవారం పెన్షన్ పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. ఎవరైనా వరుసగా మూడు నెలలు పింఛను తీసుకోకపోతే వారి పెన్షన్ రద్దవుతుందని పేర్కొన్నారు.



ఊరట

● మధ్యాహ్న భోజనం ధరల పెంపు
● రేపటి నుంచి అమలులోకి..
● నిర్వాహకుల్లో ఆనందం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కేంద్ర ప్రభుత్వం తీయటి కబురు అందించింది. ఒకటవ తేదీ నుంచి ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది. జిల్లాలో 2,040 ప్రాథమిక పాఠశాలల్లో 65,109 మంది, 220 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20,820 మంది, 336 ఉన్నత పాఠశాలల్లో 1,03,150 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం రూ.5.45 చొప్పున ఇస్తుండగా దానిని రూ.6.19లకు పెంచారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ.8.17 ఇస్తుండగా, దీనిని రూ.9.26 చొప్పున చెల్లించనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరించాల్సి ఉంటుంది. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 498 మంది విద్యార్థులు ఉండగా, నెలకు సుమారు రూ.40 వేల వరకు మధ్యాహ్న భోజనానికి ఖర్చు అవుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు పెరిగిన ధరలతో ఈ కష్టాలు తొలగి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందనుంది.



- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)

జీజీహెచ్‌లో తక్కువ ధరకే స్కానింగ్

● అడ్మిట్ రోగులకు ఉచితం
● అవుట్ పేషెంట్లకు మాత్రం తక్కువ రేటుకే!



జీజీహెచ్‌లో స్కానింగ్ సెంటర్

నెల్లూరు (వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో (జీజీహెచ్) అతి తక్కువ ధరకే ఎమ్మారై, సిటీ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు జీజీహెచ్ రోగులే కాదు.. బయటివాళ్లకు కూడా పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పాట్నర్‌షిప్) పద్ధతిలో అవకాశం కల్పించారు. ఇది ఎప్పటినుంచో ఉన్నా చాలామందికి ఈ విషయం తెలియక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు పరీక్షలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్లో బ్రెయిన్ పెయిన్ ఎంఆర్‌ఐకు రూ.5,500 ఖర్చు అవుతుండగా జీజీహెచ్‌లో మాత్రం రూ.2,660లకే చేస్తున్నారు. రూ.6వేలు విలువ చేసే ఆర్బిట్ పరీక్షను కూడా రూ.2,660లకే చేస్తుండటం గమనార్హం. మరోవైపు ప్రైవేట్ వైద్యులు కూడా జీజీహెచ్‌లో ఎమ్మారై, సిటీస్కాన్ ఉందని అక్కడ తీయించుకో వచ్చని రోగులకు చెప్పడం లేదు. ఇందుకు ఆయా స్కానింగ్ కేంద్రాలలో వైద్యులకు కమీషన్ రూపంలో కొంత నగదు ముడుతుండటమే ఇందుకు కారణం. మరోవైపు కొందరు ప్రభుత్వ వైద్యులు కూడా జీజీహెచ్ స్కానింగ్ కేంద్రానికి వెళ్లమని సూచించటం లేదు. దీంతో బాధితుల జేబులకు చిల్లు పడక తప్పటం లేదు. కాగా, జీజీహెచ్‌లో అడ్మిట్ అయిన రోగులకు మాత్రం ఈ స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు.

రేడియాలజిస్టుల కొరతతో ..

జీజీహెచ్‌లో ఇద్దరు రేడియాలజిస్టులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో ఇక్కడ ఎమ్మారై, సిటీస్కాన్‌ను రోజుకు 50 మందికి మాత్రమే చేస్తున్నారు. రోగుల అవసరాలకు అనుగుణంగా కనీసం ఐదుగురు రేడియాలజిస్టులు అవసరమని సూపరింటెండెంట్ డీఎంఈకి ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ భర్తీ చెయ్యలేదు. ప్రస్తుతం ఈ కేంద్రం ఐపీఎంఎస్ ఐడీసీ నిర్వహణలో నడుస్తోంది.

జీజీహెచ్, ప్రైవేటు కేంద్రాలలో స్కానింగ్ ధరలు (రూ.లలో)

పరీక్ష	ప్రైవేట్	జీజీహెచ్
బ్రెయిన్ పెయిన్ ఎంఆర్‌ఐ	5,500	2660
బ్రెయిన్ పెయిన్, కాంట్రాక్టు	8,000	3,460
హోల్ అబ్డామిన్	5,000	2,660
థొరాక్స్ /చెస్ట్	5,500	2,660
పీఎన్‌ఎస్, నెక్	5,000	2,660
ఆర్బిట్	6,000	2,660
పిట్యూటరీ ఫోసా	6,000	2660
టెంపోరల్ బోన్	6.000	2,660
జాయింట్ (ఎనీవన్)	5500	3,045
మస్కిలోస్కెలిటల్	6,000	2,820
స్పైన్	5,500	2,660
సీటీస్కాన్	3,500	839
(ఫిల్మ్‌కు రూ.200 అదనం)		

అందరూ సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆసుపత్రులలోని రోగులే కాకుండా బయట పలు ఆసుపత్రులలోని రోగులు కూడా పీపీపీని సద్వినియోగం చేసుకోవచ్చు. ఎంఆర్ఐ, సీటీస్కాన్ అందుబాటులోకి వచ్చినా తగినంత మంది రేడియాలజిస్టులు లేరు. దీనివల్ల రిపోర్టులలో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం వెంటనే రేడియాలజిస్ట్ ఖాళీలను భర్తీ చేయాలి.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

విద్యాశాఖలో అధికారుల బదిలీలు

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులను బదిలీ చేస్తూ డైరెక్టర్ వి.విజయరామ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు డిప్యూటీ ఈఓగా పనిచేస్తున్న కె.ప్రసన్నలక్ష్మిని డీఈవో కార్యాలయం ఏడీగా, కావలి డిప్యూటీ ఈఓ పి.రఘురామయ్యను, ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్‌ను స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న టి.విజయ్‌కుమార్‌ను కడప జిల్లా ఆర్జేడీ కార్యాలయ ఏడీగా నియమించారు. అలాగే సమగ్రశిక్షలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఓవీఎస్.అనిల్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై గుంటూరు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే విధుల్లో చేరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈగల్‌తో ఆగేనా!?

గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)ను రంగంలోకి దించుతోంది. ఇప్పటికే అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్స్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయగా జిల్లా స్థాయిలో నెల్లూరులోనూ ఈగల్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో విచ్చల విడిగా గంజాయి విక్రయాలు జరిగాయి. ఇతర రాష్ట్రాలకు జిల్లా మీదుగా పెద్ద సంఖ్యలో సరుకు రవాణా జరిగేది. ఆఖరికి చిల్లర అంగళ్లలోనూ గాంజా దొరికే స్థాయికి పరిస్థితులు చేరుకున్నాయి. వ్యాపారులు పంథా మార్చి సేల్స్‌మెన్ ఏర్పాటు చేసుకుని మరీ యువతను వ్యసనపరులుగా మారుస్తున్నారు. సులభంగా మత్తు లభిస్తుండటంతో ఆకర్షితులైన విద్యార్థులు వాటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇక జిల్లాలో జరిగే నేరాల్లో అధికానికి గంజాయే ప్రధాన కారణమని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈగల్ విభాగం గంజాయి ముఠా పీచమణిచేలా పనిచేయాలని జిల్లావాసులు ఆశిస్తున్నారు.



● జిల్లాకు నార్కోటిక్స్ కంట్రోల్ విభాగం
● గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయం
● యువతకు శాంపిల్స్ ఇచ్చి బానిసలు చేసి..
● గంజాయి మత్తులోనే పెరుగుతున్న నేరాలు
● నూతన విభాగంతో నియంత్రణపై ఆశలు

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థుల జీవితాల్లో గంజాయి విష వృక్షంలా మారుతోంది. ఎంతో మంది ఆ మత్తుకు బానిసలుగా మారుతున్నారు. గంజాయి విక్రయదారులు కూడా యువతనే లక్ష్యంగా చేసుకుని వారిని మత్తులో దించి జేబులు నింపుకుంటున్నారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మత్తుకు ఎక్కువగా బానిసలవుతున్నారని సమాచారం. ఆయా కళాశాలల యాజమాన్యాలకు ఈ విషయం తెలిసినా తల్లిదండ్రులకు చెప్పి ఊరుకుంటు న్నారేగానీ పోలీసులకు ఫిర్యాదు వరకు వెళ్లడం లేదు. విద్యాసంస్థలకు చెడ్డ పేరు వస్తుందన్న భావనతో మత్తు విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఇది పరోక్షంగా గంజాయి వ్యాపారులకు ధైర్యాన్నిస్తోంది.

● సేల్స్‌మెన్‌తో వ్యాపారం

గంజాయి వ్యాపారులు కొత్త పంథాను ప్రారంభించారు. విశాఖపట్నం పరిసర ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రైలు, రోడ్డు మార్గాల్లో జిల్లాకు చేరుతోంది. అలా వచ్చిన దానిని టోకు వ్యాపారులు కేజీ రూ.5 వేలకు దిగుమతి చేసుకుంటున్నారు. ఆ తర్వాత కిందిస్థాయి వ్యాపారులకు కేజీ రూ.8 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. ఆ వ్యాపారులు గతంలో 20 గ్రాములు, 50 గ్రాముల ప్యాకెట్లు తయారు చేసి గంజాయి బానిసలకు విక్రయించేవారు. అయితే ప్రస్తుతం వ్యాపార శైలిని మార్చేశారు. యువత, విద్యార్థులే లక్ష్యంగా సేల్స్‌మెన్‌ను ఏర్పాటు చేసుకొని బిజినెస్ పెంచుకుంటు న్నారు. ఒక్కో గంజాయి ప్యాకెట్‌పై కమీషన్‌తోపాటు నెలవారీ జీతాలు కూడా ఇస్తున్నారు. ఆ సేల్స్‌మెన్ కళాశాలలు, పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, సినిమా థియేటర్లు, కేఫ్‌లు, బార్లు, మద్యం దుకాణాలు, క్రీడా మైదానాల్లో ఉండి సిగిరెట్లు, మద్యం సేవించే వారికి గంజాయి శాంపిల్ ప్యాకెట్లను ఫ్రీగా ఇచ్చి మత్తును అలవాటు చేస్తున్నారు. వారు బానిసలుగా మారిన తర్వాత గంజాయిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విధంగా కేజీకి రూ.15 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు తెలిసింది.

● ఇంటర్ దశలోనే బానిసలుగా..

ఎక్కువగా ఇంటర్ చదివే విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసల వుతున్నారని పరిశీలకులు చెబుతున్నారు. స్నేహితులు, క్లాస్ మెట్స్ ద్వారా ఈ వ్యసనానికి అలవాటు పడుతున్నారు. వ్యాపారులు కూడా ఇలాంటి విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రూ.200 నుంచి రూ.300కు ప్యాకెట్లు అమ్ముతున్నారు. అలా కొన్న గంజాయిని పొడిచేసి సిగిరెట్లలో కలిపి పీలుస్తున్నారు. కొన్నాళ్లకు గంజాయి మత్తు సరిపోక ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ, బ్రౌన్ షుగర్, హెరాయిన్ వంటి వాటి కోసం ఇతర రాష్ట్రాల వైపు అడుగులు వేస్తూ జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు.

● నేరాలకు అదే కారణం

ఇటీవల కాలంలో జిల్లాలో చోటు చేసుకున్న హత్యలు, గొడవలు, హత్యా యత్నాల్లో ఎక్కువ గంజాయి మత్తులోనే జరిగాయని పోలీసుల విచారణలో తేలింది. గతంలో చిన్నబజారు పోలీసులు డ్రగ్ ర్యాకెట్‌ను చేదించి, ముఠాను అదుపులోకి

- మిగతా 6లో..

గంజాయి కేసుల వివరాలు ఇలా...

సంవత్సరం	కేసులు	పట్టుకున్నది	రూ.ధర	అరెస్టులు	వాహనాల సీజ్
2021	16	270.7 కేజీలు	2.70 లక్షలు	39	7
2022	7	708.4 కేజీలు	7.8 లక్షలు	15	7
2023	16	369.5 కేజీలు	3.69 లక్షలు	93	10
2024	13	111.9 కేజీలు	1.11 లక్షలు	44	3

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం

గంజాయి, మాదకద్రవ్యాల కట్టడి కోసం ప్రత్యేకంగా జిల్లాలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. ఆ టీం నిరంతరం తనిఖీలు చేస్తూ గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, అమ్మకాలు, సేవించడంపై దాడులు చేస్తోంది. విద్యాసంస్థల్లో మత్తు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాము. చెక్‌పోస్టుల్లో అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాము.

- జీ కృష్ణకాంత్, ఎస్పీ

పెన్నాకు హైఅలెర్ట్!

● భారీ వరదలు సంభవించే ప్రమాదం ● అప్రమత్తంగా ఉండాలని కేంద్రం హెచ్చరిక



నెల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెన్నా నదికి భారీగా వరద పోటెత్తే ప్రమాదముందని కేంద్ర జలశక్తి శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో పెన్నా పరివాహకంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలియజేసింది. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ అతి భారీ వర్షాల మూలంగా వరదలు సంభవించవచ్చని జిల్లాను అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. శుక్రవారం రాత్రి కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు లేఖ రూపంలో అత్యవసర మెసేజ్‌ను కేంద్ర జలశక్తి శాఖ అధికారులు పంపారు. జిల్లాలోని పెన్నా పరివాహక ప్రాంతంతోపాటు పెన్నా ఉపనదులైన కుందు, చెయ్యేరు, పాపాగ్ని, సగిలేరు పరివాహకాల్లో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు ఆ మెసేజ్‌లో స్పష్టం చేశారు. దీని మూలంగా భారీ వరద పెన్నా నదికి వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ప్రస్తుతం సోమశిల జలాశయం 89 శాతం నిండిన నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తతో వ్యవహరించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని సమన్వయంతో అంచనా వేసుకుంటూ సోమశిలకు ఇబ్బందులు లేకుండా దిగువకు నీటిని విడుదల చేయాలని సూచించారు. అదే సమయంలో పెన్నా పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని కేంద్ర జలశక్తి శాఖ సూచించింది. ఈ సూచనలను పరిగణలోకి తీసుకొని రానున్న మూడు రోజులు అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించింది.

● మళ్లీ మొదలైన వాన

నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయు గుండం ప్రభావంతో జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా మేఘాలు కమ్ముకుని చల్లని గాలులు వీచాయి. తీవ్రవాయుగుండం చెన్నైకి ఆగ్నేయం గా 340 కి.మీ దూరంలో ఉందని, ఇది తుఫాన్‌గా మారి శనివారం మధ్యాహ్నం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి దగ్గర కారైకాల్- మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంటుంది. ఆదివారం కూడా భారీ వర్షం పడే అవకాశం ఉందని ఆ కేంద్రం ప్రతినిధులు తెలిపారు.

శ్రీనివాసుడికి పుష్పయాగం

నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో బృందావనం శ్రీనివాస దీక్షితులు, వైఖానస ఆగమ పండితులతో ముందుగా మరకత గణపతి స్వామికి అభిషేకం, వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు జరిగాయి. భక్తులు వివిధ రకాల పూలబుట్టలతో ఊరేగింపుగా తరలివచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం వేద మంత్రాల నడుమ పుష్పయాగం నిర్వహించి పంచ, అష్ట, నవ నక్షత్ర కుంభ హారతులు సమర్పించారు. ఉభయకర్తలుగా కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు, గడ్డం శ్రీధర్‌రెడ్డి, సుజన దంపతులు వ్యవహరించారు. అనంతరం అమ్మవారి పాదాల చెంత ఉంచిన చీరలను లక్కీడిప్ ద్వారా 22 మంది మహిళలకు పంపిణీ చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)



వేదగిరీశుడికి తిరుప్పావడ సేవ

నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి(నరసింహకొండ) క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్ర పూజలు నిర్వహించారు. విశేష పూజలు, అభిషేకాల అనంతరం తిరుప్పావడ సేవ వైభవంగా జరిగింది. ప్రత్యేకించి శుక్రవారం కావడంతో అటు ఆదిలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

- నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి)



చిన్నరథంపై శివయ్య ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి చిన్నరథంలో స్వామి, అమ్మవార్ల ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారికి పుష్పాభిషేకం భక్తులకు కనువిందు చేసింది. ఉభయకర్తలుగా నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, స్రవంతి, కోవూరు వెంకరెడ్డి, ధనమ్మ వ్యవహరించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సాగునీటి శిస్తు

చెల్లింపులు ఇక ఆన్‌లైన్‌లోనే

- పుస్తకాలు, రాతలకు స్వస్తి
- నమోదులో రేయింబవళ్ళు వీఆర్‌వోలు
- నేటితో ముగియనున్న కసరత్తు
- ఐదేళ్ళుగా ఆగిన శిస్తు వసూళ్ళ ప్రక్రియ

మనుబోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాగునీటి శిస్తు వసూళ్లలో పాత విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికి, ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ ప్రక్రియపై రెవెన్యూ సిబ్బంది ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. గతంలో శిస్తు వివరాలు ఏ రైతు ఎంత చెల్లించాడన్నది రైతుకు, వీఆర్‌వోకు తప్ప మరెవరికి తెలిసేది కాదు. అది కూడా వీఆర్‌వో నోటిలెక్కతో కట్టించేవారు. ఒక్కోసారి శిస్తు పుస్తకాలు కనబడక ఇటు అధికారులు, అటు రైతులు ఇబ్బందులు పడేవారు. వైసీపీ హయాంలోనే ఆన్‌లైన్ విధానం అమలు చేసినా పూర్తిస్థాయిలో కాలేదు. ఇంతలోనే రీసర్వే తీసుకురావడంతో ఆ ప్రక్రియను నిలిపేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కూడా సాగునీటిశిస్తును రైతుల నుంచి వసూలు చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆదేశాలతో వారం రోజులుగా అడంగల్ పట్టుకుని భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వీఆర్‌వోలు రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు.

సాధారణంగా ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరూ పంచాయతీకి ఏడాదికి ఒకసారి ఇంటిపన్ను చెల్లించాలి. అప్పుడే ఆ ఇంటిపై యజమానికి హక్కు ఏర్పడుతుంది. అలానే సాగునీటిని వాడుకుంటున్న భూమి కలిగిన ప్రతి రైతు రెవెన్యూ శాఖకు శిస్తు చెల్లించాల్సి ఉంటుంది. ఈ శిస్తు ఆధారంగానే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, రాయితీలు వర్తిస్తా



భూముల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న వీఆర్వోలు

యి. మాగాణి భూములకైతే ఎకరాకు ఒక పంటకైతే రూ.200, రెండు, మూడు పంటలు వేస్తే రూ.350 చెల్లించాలి. అలాగే ఆక్వాసాగు రైతులైతే ఎకరాకు రూ.500, మెట్టభూములకైతే ఎకరాకు రూ.100 చెల్లించాలి. 1430 ఫసలీ నుంచి శిస్తు వసూళ్ళు నిలిచిపోయాయి. ప్రస్తుతం రెవెన్యూలో 1434 ఫసలీ నడుస్తోంది. అంటే ఐదేళ్ల ఫసలీలకు నీటిశిస్తు రావాల్సి ఉంది. దీని ప్రకారం వీఆర్వోలు లెక్కలు కట్టి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.

- **ఎక్కడి నుంచైనా చెల్లింపులు**

పొలం కలిగిన రైతు దూర ప్రాంతంలో ఉంటే సదరు వీఆర్‌వో వద్దకు వచ్చి శిస్తు చెల్లించాల్సి ఉండేది. ఆన్‌లైన్ విధానంలో ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. రాష్ట్రంలో ఎక్కడున్నా, ఏ గ్రామంలో భూమి ఉన్నా దానికి కలిగిన ఖాతా నెంబర్‌ను చెప్పగలిగితే శిస్తుబకాయిల వివరాలు ఆన్‌లైన్‌లో తెలిసిపోతాయి. దీంతో రైతులు సులభంగా శిస్తు చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకురానున్నది. అలాగే బకాయి వివరాలు కూడా తెలుస్తాయి.

రైతులకు ప్రయోజనం



కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆన్‌లైన్‌లో నీటి శిస్తు వివరాలను వేగంగా చేయిస్తున్నాం. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఇప్పటివరకు ఎంతమేర బకాయిలు, వచ్చేఏడాది ఎంత చెల్లించాలి ఆ వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి. పైగా ఎక్కడినుంచైనా తెలుసుకోవచ్చు. రైతులు సాగునీటి శిస్తులు చెల్లించి రెవెన్యూశాఖకు సహకరించాలి.

- సిహెచ్. సుబ్బయ్య, తహసీల్దార్

ఈగల్‌తో ఆగేనా!?

(5వ పేజీ తరువాయి)

తీసుకుని విద్యార్థులకు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. అయినా డ్రగ్స్, గంజాయి రవాణాదారులు, విక్రయదారులు, వారి వెనుక ఉన్న పెద్ద వ్యాపారులను పోలీసులు పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన ఈగల్ టీం ఏ మేరకు గంజాయి, మాదకద్రవ్యాలను అరికడుతుందో చూడాలి. కాగా, జిల్లాలో ఏర్పాటు చేసే ఈగల్ స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు పోలీసు శాఖలోని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై సిబ్బందిని తీసుకుని శిక్షణ ఇస్తారని సమాచారం. వారికి అదనంగా 30 శాతం అలవెన్స్ ఇవ్వనున్నారు.

హరహరా.. శంకరా!

- ఇరుముడులతో వైభవంగా శివభక్తుల శోభాయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శంభో శంకర ... హరహర మహదేవ... ఓంనమశ్శివాయ అనే శివనామ స్మరణతో నెల్లూరు నగర ప్రధాన రహదారి మారుమోగింది. కార్తీక మాసం సందర్భంగా శివ దీక్ష ధరించిన భక్తులు దీక్ష విరమణకు శుక్రవారం ఇరుముడి కట్టుకుని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం పాలకమండలి మాజీ ఛైర్మన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు అర్ధ మండల దీక్ష స్వీకరించారు. ఆ దీక్ష విరమణ సందర్భంగా శుక్రవారం ఉదయం తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో రుద్రహోమం నిర్వహించారు. అనంతరం ఇరుమడి ధరించి మంగళవాయిద్యాలు, హరనామ స్మరణతో మూలస్థానేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మూలస్థానేశ్వర ఆలయ ఈవో జే శ్రీనివాసరావు, విజయకుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. వర్షంలోనూ భక్తులు పట్టలు కప్పుకుని ఇరుముడితో యాత్ర కొనసాగించారు.









రీసర్వే సమస్యలు పది రోజుల్లో పరిష్కరించాలి

- అధికారులను ఆదేశించిన జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రీసర్వే సమసలపై గ్రామ సభల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి పది రోజుల్లోగా సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో గ్రామసభల అర్జీలపై అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణం తేడా రావడం వంటి సమస్యలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమీక్షలో కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు ఖాతా.. రూ.200లకు వాత!

- వేలం వెర్రిగా జనాలు పరుగులు

పోస్టాఫీసులో ఖాతా తెరచి ఆధార్ లింక్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు అందుతాయనే పుకార్లు జనాల్లో షికారు చేస్తున్నాయి. ఇంకేముంది... మగ, ఆడ అన్న తేడా లేకుండా అందరూ పోస్టాఫీసులకు పరుగులు తీస్తున్నారు. బుచ్చిలోని గిరిజాహాల్ సెంటర్‌లో ఉన్న పోస్టాఫీస్ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా ఉన్నవారు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి. లేదా 18 ఏళ్లు నిండిన వారికి ఎక్కడా ఖాతా లేకుంటే పోస్టాఫీసులో ఖాతా తెరవాలి. ఇది నిబంధన. అయితే, ఇవేమీ పట్టించుకోని అమాయక జనం పోస్టాఫీసులో ఖాతా తెరిస్తేనే పథకాల ఫలాలు అందుతాయన్న అపోహతో పరుగులు తీస్తున్నారు. వారిలో చైతన్యం తీసుకురావాల్సిన తపాలా ఉద్యోగులు కూడా రూ.200 వసూలు చేసి ఖాతాలు ప్రారంభించేస్తున్నారు. బుచ్చిలోని పోస్టాఫీసుకు పొరుగు మండలాల నుంచి జనం తరలివస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాతాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.



రూ.200 తీసుకుని ఆధార్ లింక్ చేస్తున్నబీపీఎం

- బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి కావలిలో అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు

కావలిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు ఆదివారం నుంచి పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు సూచనలతో ఈ పోటీలు జరుగుతాయన్నారు. బాల, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయని 13జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేయుచున్న క్రీడాకారులకు డీబీఎస్‌లో వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, ఏవో రమేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం మహాకాళేశ్వరుని భస్మాభిషేకం

రాపూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణంలోని పురాతనమైన శ్రీ పార్వతీ సమేత రామనాథేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం చివరి శుక్రవారం కావడం వలన భక్తులు పోటెత్తారు. స్వామి వారిని ఉజ్జయిని మహాకాళేశ్వరునిగా అలంకరించారు. భస్మాభిషేకం, రుద్రహారతులు తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. శివనామ స్మరణలతో ఆలయం మార్మోగింది.



బడుల్లో పండుగ

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా

- వచ్చే నెల 7న మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం
- విద్యాపరమైన అంశాలపై చర్చ
- పాఠశాల అభివృద్ధిలోనూ భాగస్వామ్యం
- ఆటల పోటీలు, సహంపక్తి భోజనాలు
- జిల్లాకు రూ.48 లక్షల మంజూరు

నెల్లూరు (విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో వస్తున్న అనేక సంస్కరణలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపరచడానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి 2047 నాటికల్లా వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిలో భాగంగానే జిల్లాలోని 2,601 ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబరు 7వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసంగా రూ.48,67,800 నిధులను కూడా విడుదల చేశారు. పదిమంది పిల్లలున్న బడులకు రూ.వెయ్యి, 300 నుంచి 400 మంది పిల్లలు ఉన్న బడులకు రూ.5 వేలు, ఇలా సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులను కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. వారం రోజులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని డీఈఓ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు కొత్త కానప్పటికీ ఈసారి మాత్రం పలు ప్రత్యేకతలు జోడించారు. ఎన్నడూ లేని విధం గా పిల్లల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధుల కేటాయింపులు చేశారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు ఎవరిస్థాయిలో వారు మరికొంత నిధులు సేకరించి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్ ఏర్పాట్లు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా 13 కమిటీలను ఏర్పాటు చేశారు.



- **పిల్లల ప్రగతిపై నివేదికలు**

పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను ఈ సమావేశంలోనే తల్లిదండ్రులకు అందచేయనున్నారు. ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు, హాజరుతోపాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో కనబరిచిన ప్రతిభ, ఆరోగ్యపరంగా ఎత్తు, బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు. విద్యార్థులు ఇళ్లవద్ద సెల్‌ఫోన్స్, ట్యాబ్‌లు అధికంగా వినియోగంచకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతోపాటు తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందచేస్తారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే సమావేశానికి సంబంధించి మినిట్ టు మినిట్ షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు వివిధ కార్యక్రమాల అనంతరం సహపంక్తి భోజనం చేస్తారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహణ : డీఈవో బాలజీరావు

జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను డిసెంబరు 7న జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించడంతోపాటు పాఠశాలల అభివృద్ధి, చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతో చర్చిస్తాం. అలాగే పాఠశాలల బలోపేతానికి సాయం చేసిన వ్యక్తులను సన్మానించడం, పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ మెగా ఈవెంట్ ప్రత్యేక ఉద్దేశం. జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో కార్యక్రమం విజయవంతం చేస్తాము.



విస్తృత ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

జిల్లాలో నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం ఉత్సవ వాతావరణంలో జరగాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ, ఇతర అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు పాఠశాలల వైపు అడుగులు వేసేందుకు 7వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా ఈఓపీఆర్‌డీలు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసంగా ప్రత్యేక నిధులు సైతం కేటాయించినట్లు తెలిపారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల తల్లిదండ్రులను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆహ్వానించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి ఆయా వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల సిబ్బందితో కార్యక్రమం జరిగే రోజున చర్చించే విధంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ ఉదయభాస్కర్, డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, జడ్పీ సీఈఓ మోహన్‌రావు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, ఐటీడీఏ పీఓ పరిమళ, బీసీ వెల్ఫేర్ ఇన్చార్జి అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం: డీఎస్పీ


ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

ఉదయగిరి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గంజాయి విక్రయించినా, సేవించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎన్ వెంకట్రావు, ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, రఘునాథ్, శివకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం : మండల పరిధిలోని సీతారామపురం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం కావలి డీఎస్పీ శ్రీధర్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని పలు సమస్యలను స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా తెలుసుకొని వాటిపై దృష్టి సారించాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉదయగిరి సిఐ వెంకటరమణ, సీతారామపురం ఎస్సై శివకృష్ణా రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనకట్ట సుందరీకరణ పనుల పరిశీలన


రివిట్‌మెంట్ పనులు పరిశీలిస్తున్న ఈఈ వెంకటేశ్వర్లు

ఉదయగిరి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రూ. 9 కోట్లతో జరుగుతున్న ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులను శుక్రవారం ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆనకట్టకు జరుగుతున్న రివిట్‌మెంట్, కాంక్రీట్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సుందరీకరణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంతోపాటు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారుకు సూచించారు. పట్టణం నుంచి వచ్చే మురుగు నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆనకట్ట సుందరీకరణ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కందుకూరి చంద్రమౌళి, గుత్తేదారు అక్కి భాస్కర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తే జరిమానా

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తే రూ.100 జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె. అనూష శుక్రవారం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణాన్ని పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యం అన్నారు.

● అల్లూరు : స్థానిక నగర పంచాయతీలో బహిరంగ మలమూత్ర విసర్జనను నిషేధిస్తూ తీర్మానం చేసినట్లు నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పొదుపు మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నట్లు పేర్కొన్నారు. బహిరంగంగా మలమూత్ర విసర్జన చేసిన వారికి రూ.30 మూత్రవిసర్జన చేసిన వారికి రూ.20 జరిమానా విధిస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు. మల, మూత్ర విసర్జనరహిత నగర పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.



రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రంకు రోడ్డు తర్వాత అత్యధికంగా రద్దీ ఉండే రోడ్డు క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డు. ప్రయివేట్ ఆసుపత్రులన్నీ ఆ రోడ్డుకు అనుసంధానంగా ఉంటాయి. అలాగే మూడు ప్రయివేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి రద్దీగా ఉండే రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లే వాహనాలు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఆటంకం ఏర్పడి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ముదివర్తి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

అల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దళిత సర్పంచ్‌ను అవమానించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విడవలూరు మండలం ముదివర్తి దళిత సర్పంచ్ నిర్మలమ్మను పంచాయతీ కార్యదర్శి దుర్భాషలాడడం దారుణం అన్నారు. సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తామని బెదిరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వెంటనే సదరు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మీటర్ రీడర్స్‌ను ఆదుకోవాలని వినతి

కందుకూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో బిల్లుల జారీ చేస్తున్న తమను ఆదుకోవాలని మీటర్ రీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తీసుకొస్తున్నదని ఈ మీటర్లకు సిమ్ సిస్టమ్ రావటంతో ఇకముందు రీడింగ్ తీసే పని ఉండబోదని, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 300మంది ఉపాధి కోల్పోతారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో తమకు విద్యుత్‌శాఖలోనే ప్రత్యామ్నాయ పనులకు ఉపయోగించుకోవాలని కోరారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి


కార్యకర్తలకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్ షాను

ఉదయగిరి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సూపర్‌వైజర్ షేక్‌షాను సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో దుత్తలూరు, నర్రవాడ, ఉదయగిరి-2 సెక్టార్ల కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు, దాని అనర్థాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తూ నెలసరి నివేదికలు సకాలంలో అందజేయాలని సూచించారు.

పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను బహిష్కరించండి

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ముసుగులో అగ్రకుల బ్రాహ్మణీయ మనువాదులు కందుకూరులో నిర్వహించ తలపెట్టిన పీడీఎస్‌యూ అర్థశతాబ్ది ఉత్సవాలను దళితులంతా బహిష్కరించాలని మాజీ పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పీడీఎస్‌యూ మాజీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. దళిత విప్లవ నాయకుడైన నాదెండ్ల బ్రహ్మయ్యను హత్యచేసిన హంతకులు దళిత చైతన్యాన్ని నీరుగారుస్తున్నారని ఆరోపించారు. పీడీఎస్‌యూ మాజీ నాయకులు, బీటీపీ నాయకులు కళ్లగుంట మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రిటైర్డ్ వార్డెన్ వెంకటేశ్వర్లు, దళిత నేత పాలేటి కోటేశ్వరరావు, సాధు మాల్యాద్రి, జీఆర్ అంబేద్కర్, పెదబ్రహ్మయ్య, జాన్‌బాబు, మున్నంగి రమేష్, షేక్ అబ్దుల్లా, మాలకొండయ్య, శ్రీనివాసరావు, కావలి సుబ్బారావు, పల్నాటి చెన్నయ్య కొండలరావు పాల్గొన్నారు.

నిధులు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిదే

బిట్రగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి నిధులు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికే దక్కుతుందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు. శుక్రవారం బోగోలు పార్టీ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సుధీర్‌బాబు, వేంకటేశ్వర రెడ్డి, సుధాకర్, రఘురాం నాయుడు, వెంకటేశ్వర్లు, మాధవరావు, వెంకయ్య, విజయ్‌కుమార్, ప్రభాకర్, సుబ్బారావు, అహ్మద్‌బాషా ఉన్నారు.

అడ్రస్ లేని 'ఆత్మగౌరవం'

నిర్మాణాలకు నోచుకోని మరుగుదొడ్లు

నీరుగారుతున్న ప్రభుత్వాల ఆశయం


మండల పరిషత్ కార్యాలయంలో అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్లు


స్త్రీశక్తి భవనంలో నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు


హౌసింగ్ కార్యాలయంలో నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

వరికుంటపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛ కార్యక్రమాల ఆశయాలు పరోక్షంగా నీరుగారిపోతున్నాయి. మండల కేంద్రమైన వరికుంటపాడుకు ఉద్యోగం, వ్యాపారం తదితర పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. పలు గ్రామాల మీదుగా 565, 167-బి జాతీయ రహదారుల నిర్మాణం జరగడంతో ఈ పరిస్థితి నెలకొంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు సైతం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్నప్పటికీ ఉద్యోగులు, ప్రజలకు మాత్రం 'ఆత్మగౌరవం' అందని ద్రాక్షగానే ఉంది.బస్టాండ్ సెంటర్, ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో కనీస వసతులు లేవు. ఉద్యోగులు, ప్రజలు అత్యవసర సమయంలో గోడ చాటుకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. దుకాణదారులు, ఇతర గ్రామాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం చిన్నపాటి మరుగుదొడ్లనైనా బస్టాండ్ సెంటర్‌లో నిర్మించాలని వేడుకుంటున్నారు.

అసంపూర్తిగా నిర్మాణాలు

బస్టాండ్ సెంటర్‌తో సహా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గతంలో మరుగుదొడ్ల నిర్మాణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టి చేతులు దులుపుకున్నారు. అసంపూర్తిగా నిలిచిన పనులతో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అలాగే స్త్రీశక్తి భవనం, హౌసింగ్ కార్యాలయాల ప్రాంగణాల్లో నిర్మించిన మరుగుదొడ్లు సైతం నీటి వసతి కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి బస్టాండ్ సెంటర్‌తో సహా ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మరుగుదొడ్లు నిర్మించి ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మౌలిక వసతుల కరువు

● టీచర్స్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు

● ఇళ్ల మధ్యలో నిలుస్తున్న మురుగునీరు


రొచ్చురోడ్డు కిరువైపులా చిల్లచెట్లు, నీటిగుంటలు

కావలి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) స్థానిక టీచర్స్ కాలనీలో మౌలిక వసతులు కొరవడి సమస్యలకు నిలయంగా మారింది. సీసీ రోడ్లు, డ్రైన్లు లేకపోవడంతో వర్షాలు పడినపుడు కాలనీకి వెళ్లే రోడ్డంతా బురదయంగా మారుతుంది. పాదచారులు ద్విచక్ర వాహనాలు వెళ్లేలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లలోని వాడిన నీరంతా నివాసాల మధ్య ఉన్న ఖాళీ ప్రాంతాల్లో నిలిచి నీటి గుంటలను తలపిస్తున్నాయి. ఇందులో పిచ్చిమొక్కలు, చిల్లచెట్లు పెరిగి అడివిని తలపిస్తోంది. దీంతో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా పారిశుధ్యం కొరడటంతో దోమలకు నిలయంగా మారింది. రాత్రిళ్ల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

● **అర్ధాంతరంగా నిలిచిన సీసీ రోడ్ల నిర్మాణం**

గత పాలకులు ఎన్నికల ముందు పనులు ప్రారంభించి సైడ్ గట్లు నిర్మించి రోడ్ల నిర్మాణం చేపట్టక అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. రోడ్ల నిర్మాణం పేరుతో తవ్విన మట్టి రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఈ సమస్యలకు మోక్షం ఎప్పుడోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

● **ఇబ్బందులు అనుభవిస్తున్నాం: శారద స్థానికురాలు**

కొన్నేళ్ళగా ఈ కాలనీలోనే నివాసం ఉంటున్నాం. పాలకులు, అధికారులు మౌలిక వసతుల కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. వర్షాలు పడినపుడు ఇంటి నుంచి బయటకు వెళ్లలేక పోతున్నాం. చిల్లచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

గ్రామాల అభివృద్ధికి కృషి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లింగసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. ఉపాధిహామీ నిధులతో లింగసముద్రంలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో 34 సిమెంటు రోడ్ల పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసులు మాజీ జడ్పీటీసీ ప్రభావతి, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, గుర్నాథం, సీహెచ్.బ్రహ్మయ్య, శ్రీనివాసులు, మాజీ సర్పంచు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సీహెచ్ బాలకోటయ్య, మక్కెన మల్లికార్జున పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

చేజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లిలోని గురుకుల పాఠశాలలో శుక్రవారం మహిళా సాధికారత, బాలల అభివృద్ధిపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడీఎస్ సిడిపివో సునీలత, ప్రిన్సిపాల్ శైలజకుమారి, సఖి వన్ స్టాప్ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

సంగం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలోని ఎంఆర్సీ భవనంలో ఎంఈవో జానికీరామ్ వచ్చే నెల 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్ సమావేశం గురించి ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో గూగుల్ మీట్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీ చరవాణి సందేశాన్ని వినిపించారు. అనంతరం వారు పేర్కొన్న అంశాలపై సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 57 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో -2 మల్లయ్య, పాల్గొన్నారు.

11 మద్యం సీసాల స్వాధీనం

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నంగిదిన్నెలో శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అనుపల్లి వెంకమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఎక్సైజ్‌శాఖకు అందిన సమాచారం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ఎం.దేవిక, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఈగల్ జీవో విడుదలపై హర్షం

వింజమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ఈగల్ గ్రూపును ఏర్పాటు చేయడం పట్ల స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నల్లగొండ్ల సృజన హర్షం వ్యక్తం చేశారు. యువత పెడదారి పడుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలువురికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుటుంబాల సభ్యులకు అందజేశారు. ఇందులో వలేటివారిపాలెం మండలం చెర్లోపాలెం బూసి రంగయ, కళవళ్ల పిట్టా ప్రవీణ్, గుడ్లూరు గద్దె కౌశిక్ ఉన్నారు. అలాగే లింగసముద్రం మండలం ఆర్ఆర్ పాలెం కిలారి వినయ్, గుడ్లూరు మండలం కొత్తపేట జాజుల సుప్రజ అలాగే కందుకూరు మండలం విక్కిరాలపేట కల్యాణి, వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెం అనుమోలు మాధవరావు, గుడ్లూరు మండలం దప్పళంపాడు రావిపాటి సాయిసుమంత్‌లు ఉన్నారు. వీరికి ముందస్తుగా ఆపరేషన్ల కోసం ఎల్‌ఓసీలు మంజూరనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, పొడపాటి మహేష్ పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి

అధికధరల సమస్య రాకుండా అన్ని రైతుసేవా కేంద్రాలలో ఎరువుల నిల్వలు పెట్టాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. నియోజవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. ఎక్కడా ఎంఆర్పీకి మించి ఎరువులు విక్రయించరాదని కేవలం డీలర్లపైనే ఆధారపడకుండా అన్ని రైతు సేవాకేంద్రాలలో ఎరువుల నిల్వలు పెట్టాలని కోరారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చినా వ్యవసాయాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏడీఏ అనసూయ ఏఓలు రాము, హేమంత్ భరత్‌కుమార్, తిరుమలజ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా ఆవాజ్ కమిటీ ఆవిర్భావ దినోత్సవం


ఉదయగిరి రూరల్: విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టెక్కె ఉర్దూ స్కూల్‌లో శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మండల కార్యదర్శి పి యస్దానీబాషా, జేవీవీ కళాకారుడు గద్దర్‌బాబు, ఆవాజ్ మండల కమిటీ సభ్యులు పి మస్తాన్, పి సల్మాన్‌ఖాన్, షేక్ ఖాజా రంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: మండలంలోని బిజ్జంపల్లి బీసీ కాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పెన్నులు, మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు షేక్ నాయబ్‌రసూల్, రజాక్‌అన్వర్ మౌజాన్, ఇమామ్‌లకు ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇమామ్, మౌజన్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే సర్వేలు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటి జియోట్యాగ్ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ సూచించారు. అదే క్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలుకు సంబంధించిన అసెస్మెంట్ ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలన్నారు. మండలంలోని మహిమలూరులో జరుగుతున్న ఇంటి పన్ను నిర్ధారణ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పలు పథకాలకు సంబంధించిన నగదు జమ చేయడానికి ఎన్‌పీసీఐ ద్వారా బ్యాంకు లింకింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా గృహ నిర్మాణాలు చేపట్టదలిచిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయడంతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు అవసరమైన వారిని గుర్తించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జియోట్యాగ్ ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం ఆయన మహిమలూరు, నువ్వూరుపాడు సచివాలయాలను సందర్శించి బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

22 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉదయగిరి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 54 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ఉదయగిరిలో ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆకుల నరసింహులు, స్కిల్ డెలవప్‌మెంట్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, ప్లేస్‌మెంట్ అధికారి జనార్ధన్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు అక్మల్, విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వం

● వివేక్, కావలి పురపాక సంఘం ప్రణాళికాధికారి



కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటం లేదని కావలి పురపాలక సంఘం ప్రణాళిక అధికారి వివేక్ తెలిపారు. నిబంధనల మేరకు నిర్మాణాలకు అనుమతి ఇస్తామన్నారు.

? అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారా.

! పట్టణంలో ఇప్పటివరకు ఎక్కడా అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటం లేదు.

? నిభంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.

! తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిబంధనల మేరకు అనుమతులు ఇస్తున్నాం

? 30 అడుగుల రోడ్డు ఉంటేనే భవన నిర్మాణాలకు అనుమతి అన్న నిబంధనలను ఎంత వరకు పాటిస్తున్నారు.

! 30 అడుగుల రోడ్డు లేని ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న రోడ్డు ఎంతుందో తెలుసుకుని 30 అడుగులకు సరిపడా రోడ్డు ఉండేలా చూస్తాం. అపుడు కూడా రోడ్డుకు స్థలం వదిలితేనే అనుమతులు ఇస్తున్నాం.

న్యూస్ బాక్స్

అమరలింగేశ్వరుడికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉలవపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మన్నేటికోట వెలసిన గంగాపార్వతి సమేత అమలింగేశ్వరుడికి శుక్రవారం భక్తులు లక్ష కుంకుమార్చన, మృత్యుంజయ హోమం, సామూహిక పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి కళ్యాణంతో పాటు మన్నేరులో గంగా హారతి, అన్నసంతర్పణ చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాజుపాలెం జాతీయ రహదారి సమీపంలోని సాయిబాబా మందిరంలో అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న వితరణ చేపట్టారు.

ఘనంగా కోటి దీపోత్సవం


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీతారామపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి శుక్రవారం సందర్భంగా మండల పరిధిలోని ఘటిక సిద్దేశ్వర క్షేత్రంలో ఆలయ అర్చకులు సిద్దయ్య, కాశయ్యల ఆధ్వర్యంలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. ఇష్టకామేశ్వరిదేవి, ఘటిక సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర ప్రసాదాలు స్వీకరించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

కలువాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఎం నారాయణ తెలిపారు. ఒక్కో దానికి రూ.36 వేలు వంతున 22 కేంద్రాలకు రూ.7.92లక్షలు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో 14 కేంద్రాలకు మోటారు, ట్యాంక్ ఏర్పాటుకు ఒక్కో దానికి రూ.17వేలు వంతున రూ.2.38లక్షలు అదనంగా మంజూరైనట్లు ఆయన వివరించారు. త్వరలో ఈ నిధులతో నిర్మాణాలు ప్రారంభిస్తామని ఆయన తెలియజేశారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

దగదర్తి (బిట్రగుంట), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వైద్యులు అఖిల తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అలేఖ్య, సూపర్‌వైజర్ విజయ, సిబ్బంది రవీంద్ర, గుల్జార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పేర్ల సత్యనారాయణ పర్యటన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సుందరయ్యనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక వాసవీ క్లబ్, వనితాక్లబ్ సభ్యులు యూనిఫాంలు అందజేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఓ నిరుపేద మహిళలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం 62 సార్లు రక్తదానం చేసిన కనమలపూడి రమేష్‌ను, ఇటీవల గౌరవ డాక్టరేట్లు పొందిన చక్కా వెంకటకేశవరావు, రవ్వా శ్రీనివాసులులను సత్కరించారు.